# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 1 మే 2025




ఉష్ణోగ్రత (అంచనా)

| 1-5-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 40 | 28 |
| తెనాలి | 39 | 28 |
| నరసరావుపేట | 41 | 27 |
| బాపట్ల | 37 | 29 |
| రెంటచింతల | 42 | 27 |

అమరావతి

# అష్టదిగ్బంధనం

- రేపే ప్రధాని మంత్రి మోదీ పర్యటన
- సిద్ధమైన బహిరంగ సభా వేదిక ప్రాంగణం
- రాజధాని గ్రామాల్లో విస్తృతంగా పోలీసుల తనిఖీలు
- 100 మంది ఐపీఎస్‌లు.. 6 వేల మంది పోలీసులతో భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఐజీ త్రిపాఠి





సిద్ధమైన ప్రధాన వేదిక, రైతుల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలు

తుళ్లూరు(వెలగపూడి), తాడికొండ, గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం సాయంత్రం రాజధాని అమరావతికి రానున్నారు. ఈ క్రమంలో రాజధాని అమరావతిలో ప్రధాని పర్యటించనున్న ప్రాంతాన్ని ఇప్పటికే అష్టదిగ్బంధనం చేశారు. మోదీ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వెలగపూడి సచివాలయం దగ్గర్లో ప్రధాని సభ ఏర్పాట్లన్నీ బుధవారం సాయంత్రానికి అధికారులు పూర్తి చేశారు. ప్రధాని సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. నాలుగు హెలీ ప్యాడ్‌లను సిద్ధం చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రధానితో ఉంటారు. రాజధానికి భూములిచ్చిన రైతుల కోసం ప్రత్యేక గ్యాలరీను కూడా సిద్ధం చేశారు. ప్రధాని పర్యటనకు మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని పాల్గొనే బహిరంగ సభ వేదిక చుట్టూ ఎస్పీజీ బలగాలే పహారా కాయనున్నాయి. ఆ తర్వాత ఇంటిలిజెన్స్ వర్గాలతో పాటు బాంబ్ డిస్పోజల్ బృందాలు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేయనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని పర్యటనపై కేంద్ర హోంశాఖతో పాటు రాష్ట్ర పోలీసు యంత్రాంగం పూర్తిగా దృష్టి సారించింది. మోదీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర నలుమూల నుంచి ఆరు వేల మంది పోలీసులు విధులు నిర్వహించడానికి అమరావతి చేరుకున్నారు. 100 మంది ఐపీఎస్‌లు, 50 మంది ఏఎస్పీలు, 150 మంది డీఎస్పీలు, 250 మంది సీఐలు, 1000 మంది ఎస్ఐలతో పాటు ఆరు వేల మంది సిబ్బంది భద్రతా విధుల్లో నిమగ్నమయ్యారు. వీరంతా సోమవారం ఇక్కడకు చేరుకున్నారు. తాడికొండ, తాడేపల్లి, తుళ్లూరు, నల్లపాడు, మంగళగిరి తదితర ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏపీఎస్పీ, ఏపీ గ్రేహౌండ్స్‌ను స్పెషల్ పోలీసు సిబ్బంది పీఎం సభకు భద్రతకు కోసం వచ్చాయి. ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ కమాండోలు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. తాడికొండ, తుళ్లూరు పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పోలీసులు నిరంతరం గస్తీ కాస్తున్నారు. ప్రధాని పర్యటించే ప్రాంతాన్ని ఇప్పటికే హైసెక్యూరిటీ జోన్‌గా ప్రకటించారు. అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు, నాన్ క్యాడర్ ఎస్పీలు,

(మిగతా 8వ పేజీలో)

## నేడు, రేపు నిషేధాజ్ఞలు

గురు, శుక్రవారాల్లో రాజధాని ప్రాంతంలో అనేక నిషేధాజ్ఞలు అమలులో ఉండనున్నాయి. ప్రధాని పాల్గొనే ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలంటూ ఇప్పటికే ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తీవ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన కదలికలపై కౌంటర్ ఇంటిలిజెన్స్ బృందాలు ఆరాతీస్తున్నాయి. ప్రధాన మంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం రాత్రి వరకు తాడికొండ, తుళ్లూరు మండలా పరిధిలోని గ్రామాల్లో దుకాణాలు మూసేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ప్రధాని మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో ఇంకా నిర్మాణం పూర్తికాని విజయవాడ వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జిపై వాహనరాకపోకలకు అధికారులు తాత్కాలికంగానే అనుమతించారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి సభకు తరలివచ్చే వాహనాలకు విజయవాడ పశ్చిమ బైపాస్ మీదగా అనుమతించారు. గొల్లపూడి ఫ్లైఓవర్ దాటిన తర్వత ఎన్‌హెచ్ - 65 పై ఉన్న ఆర్‌వోబీ మీదగా సూరాయపాలెం నుంచి కృష్ణానదిపై కొత్తగా నిర్మితమైన బ్రిడ్జి మీదగా రాజధానిలోని వెంకటపాలెం గ్రామంలోకి వెళ్లి అక్కడ నుంచి సభాస్థలికి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌లోకి వాహనాలు చేరుకోవచ్చు. బ్రిడ్జిని సిద్ధం చేయడం కోసం శరవేగంగా బీటీ లేయరు పనులు పూర్తి చేశారు. మూడు కిలోమీటర్ల పొడవున కృష్ణా బ్రిడ్జి మీద ప్రయాణిస్తూ ఒక వైపు కృష్ణా నది అందాలు, మరోవైపు దూరాన ప్రకాశం బ్యారేజ్, నది మధ్యలో దీవులు వీక్షించుకుంటూ అమరావతి రాజధానిలోకి అడుగు పెట్టవచ్చు. అమరావతి సభ పుణ్యమా అని ప్రజలంతా కృష్ణాబ్రిడ్జి గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడింది.

## వర్షం వస్తే పార్కింగ్‌కు ప్లాన్ బీ

అమరావతి సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. జిల్లాల వారీగా వాహనాల పార్కింగ్‌కు 11 ప్రాంతాలను ఎంపిక చేశారు. అయితే వర్షం పడినా పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో రాజధానిలో పరిధిలో గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన 360 కిలోమీటర్ల రోడ్లను వాహనాల పార్కింగ్‌కి వినియోగించుకునేలా ప్లాన్‌బీని అధికారులు సిద్ధం చేశారు. ప్లాన్ బీ ప్రకారం 3000 బస్సులు, వెయ్యి కార్ల పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

## రూ.58 వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

అమరావతి రాజధాని నగరంలో ఏకకాలంలో రూ.58 వేల కోట్ల విలువ కాగల బహుళాభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు. పీఎంవో అధికారికంగా వాటిని ధ్రువీకరించింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని పునాదిరాయి వేసే ప్రాజెక్టుల్లో శాశ్వత అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం, ఇతర పరిపాలన భవనాలు, 5,200 కుటుంబాలకు నివాసాలున్నాయి. వీటి విలువ రూ.11,240 కోట్లుగా పీఎంవో పేర్కొన్నది. రూ.17,400 కోట్లు ఖర్చయ్యే 320 కిలోమీటర్ల రోడ్లు, భూగర్భ పైపులైన్లు, కేబుల్స్ నిర్మాణం తదితరాలున్నాయి. రూ.20,400 కోట్లు కాగల ఎల్‌పీఎస్‌లో 1,281 కిలోమీటర్ల రోడ్లు, సెంట్రల్ మీడియన్స్, సైకిల్ ట్రాక్‌లు, రాజధానిని అనుసంధానించే ప్రాజెక్టులున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నిర్మాణం జరగనున్న ఈ అభివృద్ధి పనులు ప్రధాని పర్యటన ముగిసిన మరుసటి రోజు నుంచే పరుగులు పెట్టనున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే యంత్రాలు, కార్మికులు పెద్దసంఖ్యలో ఆయా ప్రాంగణాలకు చేరి ఉన్నారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

# ..అంతకు మించి



వినుకొండ మున్సిపాలిటీ

'ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించి.. 5 శాతం రాయితీ పొందండి.' అని ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు విశేష స్పందన లభించింది. మునిసిపాలిటీల్లో పన్ను చెల్లింపుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రాయితీ వెసులుబాటు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని పురపాలక సంఘాలకు కాసుల వర్షం కురిపించింది. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు జరిగాయి. నెల రోజుల్లో దాదాపు రూ.104 కోట్లు పన్ను చెల్లించడం విశేషం.

- లక్ష్యాలకు మించి వసూలైన ఆస్తి పన్ను
- మునిసిపాలిటీలకు.. కాసుల వర్షం
- కలిసొచ్చిన 5 శాతం పన్ను రాయితీ
- ఏప్రిల్‌లో ముందస్తు పన్ను వసూళ్లు రూ.104 కోట్లు
- స్వచ్ఛందంగా స్పందించిన పన్నుదారులు
- రాష్ట్రంలో అద్దంకి ప్రథమం.. వినుకొండ ద్వితీయం

మునిసిపాల్టీల వారీగా రాయితీపై పన్ను చెల్లింపు ఇలా

| | వార్షిక డిమాండ్ రూ కోట్లలో | పన్ను చెల్లింపు | వసూలు శాతం |
|---|---|---|---|
| **పల్నాడు జిల్లా** | | | |
| నరసరావుపేట | 22.18 | 4.77 | 21.49 |
| చిలకలూరిపేట | 25.17 | 2.57 | 10.22 |
| వినుకొండ | 7.03 | 2.68 | 38.13 |
| సత్తెనపల్లి | 10.23 | 1.98 | 19.34 |
| పిడుగురాళ్ళ | 7.89 | 1.94 | 24.65 |
| మాచర్ల | 8.33 | 1.64 | 19.72 |
| దాచేపల్లి | 3.12 | 0.73 | 23.32 |
| గురజాల | 1.95 | 0.46 | 23.39 |
| **బాపట్ల జిల్లా** | | | |
| అద్దంకి | 5.28 | 2.14 | 40.52 |
| చీరాల | 15.38 | 4.55 | 29.59 |
| బాపట్ల | 15.36 | 3.34 | 21.75 |
| రేపల్లె | 6.84 | 1.98 | 28.98 |
| **గుంటూరు జిల్లా** | | | |
| గుంటూరు | 338.72 | 52.72 | 15.57 |
| తెనాలి | 32.85 | 7.37 | 22.43 |
| పొన్నూరు | 7.85 | 2.29 | 29.24 |
| మంగళగిరి,తాడేపల్లి | 46.21 | 12.82 | 27.74 |

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పన్ను వసూలుకు మునిసిపల్ సిబ్బంది ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితి లేకుండానే పన్ను దారులు స్వచ్ఛందంగా పురపాలక కార్యాలయాలకు వచ్చి మరీ పన్ను చెల్లించి.. రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. గత నెల 1వ తేదీ నుంచి అమలులో ఉన్న రాయితీ పథకం బుధవారంతో ముగిసింది. రాయితీపై పన్ను వసూలులో అద్దంకి పురపాలిక రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం.. వినుకొండ ద్వితీయ స్థానంలో నిలిచింది.

### అంచనాలకు మించి..

ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఏప్రిల్ నెలకు మాత్రమే అమలు చేశారు. మునిసిపాలిటీలు కూడా దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాయి. ఈ మేరకు పన్నుదారులు స్పందించడంతో అంచనాలకు మించి పన్ను వసూలైంది. వార్షిక పన్ను డిమాండ్‌లో అద్దంకి మునిసిపాలిటీలో 40.99 శాతం, వినుకొండ మునిసిపాలిటీలో 38.32 శాతం పన్ను చెల్లించారు. ఆరు నెలల్లో వసూలు అయ్యే పన్ను ఒక నెలలో వసూలు కావడం విశేషం. పన్ను వసూలులో పురపాలక సంఘాలు గణనీయమైన వృద్ధిని సాధించాయి.

### గుంటూరులో ఒక్క రోజే రూ.4 కోట్లు..

గుంటూరు కార్పొరేషన్‌లో బుధవారం ఒక్క రోజే రూ.4 కోట్లకు పైగా పన్ను చెల్లించడం గమనార్హం. నరసరావుపేట మునిసిపాలిటీ 30 శాతం.. గతేడాది కన్నా అధికంగా పన్ను వసూలు చేసింది. చిలకలూరిపేట పురపాలిక 100.50 శాతం, సత్తెనపల్లి మునిసిపాలిటీ 73.20 శాతం వినుకొండ 14.40, పిడుగురాళ్ల 57.84, మాచర్ల 44, దాచేపల్లి 54.50, గురజాల 87.40, గుంటూరు కార్పొరేషన్ 16.60, పొన్నూరు 51.60, తెనాలి 10.90, మంగళగిరి, తాడేపల్లి 38.55, అద్దంకి 21.90, రేపల్లె 45.90, చీరాల 17.50, బాపట్ల 113.20 శాతం అంటే గతేడాది కంటే అధికంగా పన్ను వసూలు చేశాయి. ఇది మునిసిపాలిటీలు సాధించిన ఘనత కాదని.. పన్నుధారులు స్వచ్ఛందంగా స్పందించడం వల్లే సాధ్యమైందని చెప్పవచ్చు. పెద్ద ఎత్తున పన్ను చెల్లించడంతో పురపాలక సంఘాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. జీతాలు సకాలంలో చెల్లించడంతో పాటు ప్రగతి పనులను వేగవంతం చేసే అంకాశం ఏర్పడింది.

# ఆన్‌లైన్ బెట్టింగులు.. క్రెడిట్ కార్డు అప్పులు

- బయటపడేందుకు దొంగతనం
- పోలీసుల అదుపులో చీరాల చోరీ కేసు నిందితులు



ఆభరణాల బ్యాగుతో వెళుతున్న మునీర్

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగులు, మరో వైపు క్రెడిట్ కార్డు అప్పులు పెరగడంతో వాటి నుంచి బయటపడేందుకు చోరీ మార్గం ఎంచుకున్నారు. మంగళవారం రాత్రి చీరాల పరిధిలోని పువ్వాడ వారి వీధిలో జరిగిన బంగారం, నగదు చోరీ కేసును చీరాల వన్‌టౌన్ పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. వివరాల్లోకి వెళితే, నవాబ్‌పేటకు చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ ఆజాద్, ప్రతాప్ బీఈడీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మువ్వల ప్రసాదరావు ఇంట్లో కొంతకాలంగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆజాద్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో నష్టపోయాడు, అలాగే క్రెడిట్ కార్డుల అప్పులు కూడా పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో తన యజమాని ఇంట్లోనే దొంగతనం చేసి వీటి నుంచి బయటపడాలనుకున్నాడు. దీనికి చీరాల ప్రసాద్ థియేటర్ సమీపంలో బిర్యానీ పాయింట్ నడుపుతున్న మునీర్ సహకరించాడు.వీరిద్దరూ దీని కోసం దాదాపుగా నెల నుండిరెక్కీ నిర్వహిస్తున్నారు.

### చోరీ జరిగింది ఇలా...

పథకంలో భాగంగా ఆజాద్ మంగళవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో ప్రసాదరావు ఇంటికి వెళ్లాడు. దీంతో ఒక ట్యూబ్ లైట్ అమర్చమని యజమాని చెప్పడంతో విద్యుత్ పనులు చేస్తున్నట్లు నటిస్తూ, విద్యుత్ సరఫరా నిలిపి వేశాడు. దీంతో దగ్గరలో ఉన్న మునీర్ ప్రతాప్ ఇంట్లోకి చొరబడి మూలన నక్కాడు. అనంతరం ఆజాద్ యధావిధిగా సరఫరా పునరుద్ధరించి వెళ్లిపోయాడు. అయితే రాత్రి 8 గంటలకు పట్టణంలో హాస్పిటల్‌కు వెళ్లేందుకు ప్రసాదరావు, పద్మావతి దంపతులు హడావిడిగా ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న మునీర్ ఇల్లంతా దోచేశాడు. ఏకంగా సుమారు రూ.1.25 కోట్లు విలువైన 117 సవర్ల బంగారు ఆభరణాలుతో పాటు రూ.1.60 లక్షలు నగదు బ్యాగులో సర్దుకున్నాడు. అలాగే డాగ్ స్క్వాడ్ వాసన పట్టకుండా ఇల్లంతా కారం చల్లాడు. తిన్నగా బంగారు బ్యాగుతో వెనుక తలుపు తీసుకుని పరారయ్యాడు. అయితే ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో ఈ వీధిలో ఉన్న రెండు చోట్ల సీసీ కెమెరాల్లో మునీర్ రికార్డయ్యాడు. రాత్రి 10 గంటల తరువాత ఇంటికి చేరిన దంపతులు తాళాలు తెరచి విస్తు పోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ సుబ్బారావు క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. అలాగే ఎలక్ట్రీషియన్ ఆజాద్ వచ్చిన విషయాన్ని గ్రహించి ఇంటి వద్ద ఉన్న ఆజాద్‌ను స్టేషన్‌కు తరలించి వారిదైన పద్ధతిలో విచారించారు. దీంతో అతను వెంటనే మొత్తం నేరాన్ని అంగీకరించాడు. అలాగే మునీర్ మాత్రం నవాబ్‌పేటలోని అతని ఇంటిపై ఉన్న డ్రమ్ము కింద బంగారు బ్యాగును ఉంచి, ఫోన్ స్విచాఫ్ చేసుకుని స్కూటీపై ఒంగోలుకు చేరాడు. అయితే అతని భార్య ఫోన్ నెంబర్ ద్వారా మునీర్‌ను గుర్తించి, గంటల్లోనే ఒంగోలులో అర్ధరాత్రి మునీర్‌ను అదపులోకి తీసుకున్నారు. అపహరణ జరిగిన బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు.

# వైసీపీ హయాంలో రాష్ట్రం సర్వనాశనం

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- అగ్నిమాపక కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు భూమి పూజ

అద్దంకి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అసమర్థుడైన జగన్మోహనరెడ్డి సిఎంగా ఐదేళ్ల పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని, దీంతో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కు పోయిందని, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలో రూ.2.25 కోట్ల తో అగ్నిమాపక కేంద్రం, రూ.11.23 కోట్లతో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. జగన్మోహనరెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణాలను నిలిపివేయడంతో పాటు చిన్నాభిన్నం చేశాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాలన గాడిలో పెట్టడంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అమరావతిలో కూడా నిర్మాణాలు ప్రారంభం అయ్యాయన్నారు. కార్యక్రమం లో విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, జిల్లా అగ్నిమాపక అధికారి మాధవ నాయుడు, విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు, కన్‌స్ట్రక్షన్ ఈఈ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అగ్నిమాపక కేంద్రం శంకుస్థాపన శిలాఫలకంను ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్





# టీడీపీలోకి జంజనం

- చీరాల వైసీపీకి భారీ షాక్
- పల్లా సమక్షంలో చేరిన చైర్మన్
- స్వాగతించిన పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపాలిటీలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు బుధవారం అమరావతి సచివాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈక్రమంలో నాయకులు పార్టీ కండువాతో జంజనంను పార్టీలోకి స్వాగతించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి చేస్తున్న అభివృద్ధి పనుల్లో భాగమయ్యేందుకు పార్టీలోకి చేరినట్లు తెలిపారు. వారి వెంట రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## పొగాకు కొనుగోలు చేసేంతవరకు ఆందోళనలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేసేంతవరకు ఆందోళనలు నిర్వహించాలని రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం నిర్ణయించింది. గుంటూరులోని వీఎల్ రావు భవన్



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

లో బుధవారం రైతు సంఘ నాయకుల రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రెండు నెలల నుంచి రాష్ట్రంలో పొగాకు కొనుగోలు ప్రక్రియ ఆగిపోయిందని, దీంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ముఖ్యంగా బ్లాక్ బర్లీ కొనుగోలును పూర్తిగా నిలిపివేశారని పేర్కొన్నారు. రైతులు ఎకరాకు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టారని, పంట చేతికివచ్చే సమయంలో కంపెనీలు తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయన్నారు. లాం ఫామ్‌లో పొగాకు కంపెనీలతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మొత్తం పొగాకు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. దీనికి కంపెనీలు సుముఖత వ్యక్తం చేశాయని, మే నెలలోపు పొగాకు మొత్తం కొనుగోలు చేయకపోతే రైతులతో భారీ ఎత్తున ఆందోళన దిగుతామని హెచ్చరించారు. నాణ్యత, తేమశాతం పేరుతో కొనుగోలు ఆపివేస్తే ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. పలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, కేవీవీ ప్రసాదు, కొల్లా రాజమోహన్, ఎం.హరిబాబు, పి.జమలయ్య, వై.రాధాకృష్ణమూర్తి, నరసింహారావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## లా సెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): న్యాయ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే లా సెట్-25కు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జాగర్లమూడి చంద్రమౌళి, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినేని సుధాకరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న ఉదయం 9 గంటల నుంచి తరగతులు కళాశాల ఆవరణలో మొదలవుతాయని పేర్కొన్నారు. మూడేళ్ల, ఐదేళ్ల కోర్సులకు జూన్ 5న ప్రవేశ పరీక్షలు ఉంటాయని, వివరాలకు 0863-2350330, 98485 50353 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



# పీఎం పర్యటన నేపథ్యంలో వాహనాల దారి మళ్లింపు

**రేపటి ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆంక్షలు**

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా శుక్రవారం జాతీయ రహదారుల్లో ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. 2న ఉద యం 5 నుండి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమ లులో ఉంటాయని వెల్లడించారు. అమరావతిలో శంకుస్థాపన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన, సంబంధిత బహిరంగ సభ సజావుగా సాగడానికి జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహన రద్దీని నివారించడానికి.. ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద విధంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు వివరించారు.

**ట్రాఫిక్ మళ్లింపులు (భారీ, ఇతర వాహనాలతో సహా)..**

చెన్నై వైపు నుండి విశాఖపట్నంకు వయా విజయవాడ మీదుగా.. ఇబ్రహీంపట్నం, నందిగామ, వైపుకు వెళ్ల భారీ గూడ్స్ వాహనాలను ఒంగోలు జిల్లా త్రోవగుంట నుండి చీరాల- బాపట్ల - రేపల్లె - అవనిగడ్డ- పామర్రు గుడివాడ హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం, ఇబ్రహీంపట్నం వైపునకు మళ్లించడం జరుగుతుందన్నారు. విశాఖపట్నం నుండి చెన్నై వైపు వాహనాలు కూడా అదే మార్గంలో వెళ్లాలని సూచించారు.

- చిలకలూరిపేట వైపు నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాలను ఎన్‌హెచ్ - 16 మీదుగా పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా.. అవనిగడ్డ, పామర్రు గుడివాడ - హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించినట్లు తెలిపారు.
- చెన్నై నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బోయపాలెం క్రాస్ వద్ద నుండి ఉన్నవ గ్రామం, ఎ.బి.పాలెం, వల్లూరు, పాంఢ్రపాడు, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా.. అవనిగడ్డ, పామర్రు -గుడివాడ-హనుమాన్ జంక్షన్ నుండి విశాఖపట్నం వైపు మళ్లించినట్లు తెలిపారు.
- గుంటూరు నుండి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను బుడంపాడు క్రాస్ మీదుగా తెనాలి - వేమూరు- కొల్లూరు - వెల్లటూరు జంక్షన్ - పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా... అవనిగడ్డ, పామర్రు - గుడివాడ - హనుమాన్ జంక్షన్ నుంచి విశాఖపట్నం వైపు మళ్లించినట్లు తెలిపారు.
- గన్నవరం నుండి హైదరాబాద్‌కు వయా ఆగిరిపల్లి - శోభనాపురం, గణపవరం, మైలవరం జి. కొండూరు ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్లాలి.
- విశాఖపట్నం నుండి హైదరాబాద్ వైపు : హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు - మైలవరం జి.కొండూరు - ఇబ్రహీంపట్నం వైపు భారీ గూడ్స్ వాహనాలు వెళ్లాలని సూచించారు. హైదరాబాద్ నుండి విశాఖపట్నం ఇదే మార్గంలో వెళ్లాలని తెలిపారు.

**మల్టీ-యాక్సిల్ గూడ్స్ వాహనాలకు ప్రత్యేక సూచనలు**

**చెన్నై నుండి విశాఖపట్నం:** ఈ వాహనాలు చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు వద్ద జాతీయ రహదారి దగ్గర మళ్లింపు లేకుండా నిలిపివేసుకోవాలని సూచించారు.

**విశాఖపట్నం నుండి చెన్నై:** ఈ వాహనాలు హనుమాన్ జంక్షన్, పొట్టిపాడు టోల్ గేట్ వద్ద జాతీయ రహదారి దగ్గర నిలిపివేయాలన్నారు.

ఆగిన అన్ని మల్టీ-యాక్సిల్ వాహనాలు మే 2న రాత్రి 9 గంటల తర్వాత ముందుకు సాగడానికి అనుమతిస్తామని తెలిపారు. ఈ సమయంలో ట్రాఫిక్ సజావుగా సాగేలా చూసేందుకు ప్రయాణికులు సహకరించాలని పోలీస్ అధికారులు కోరారు.

# జీవితాంతం రుణపడి ఉంటాం

- కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- తాకట్టులోని ఇంటి పత్రాలు విడిపించి అందజేత
- ఆనంద భాష్పాలతో.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



షేక్ ఫాతిమా కుటుంబసభ్యులకు ఇంటి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటకు కట్టుబడి.. నిలబడ్డారు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. తాకట్టు లో ఉన్న కార్యకర్త ఇంటి పత్రాలను విడిపించి.. ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. పిడుగురాళ్ల పట్టణంలోని 13 వార్డుకు చెందిన షేక్ సుభాని టీడీపీ ఆవిర్భావం నుండి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశాడు. ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనే వాడు. రెండు నెలల క్రితం సుభాని గుండెపోటుతో మృతి చెందగా పరామర్శిం చేందుకు సుభాని ఇంటికి యరపతినేని వెళ్లారు. సుభాని భార్య ఫాతిమా కన్నీటి పర్యంతమవుతూ.. ఉన్న ఇంటిని భర్త తాకట్టు పెట్టాడని, తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామంటూ ఎమ్మెల్యేకు గోడు వెళ్లబోసుకుంది. పిల్లల చదువు, కుటుంబం నిర్వహణ కూడా కష్టంగా మారిందని ఫాతిమా కుటుంబ సభ్యులు వాపోయారు. దీంతో చలించిన యరపతినేని అప్పటికప్పుడు ఆ ఇంటిని తాకట్టు నుండి విడిపించేందుకు, కుటుంబ పోషణ నిమిత్తం రూ. 3 లక్షల నగదును గత నెలలో అందించారు. తాకట్టులో ఉన్న ఇంటిని విడిపించి పత్రాలను తానే స్వయంగా అందిస్తానని చెప్పి.. బుధవారం సుభాని భార్య ఫాతిమా, కుటుంబ సభ్యులకు ఇంటి దస్తావేజులను అందజేశారు. సుభాని కుటుంబం పట్ల యరపతినేని చూపిన చొరవపై మైనారిటీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.



**మాట నిలబెట్టుకున్నారు..: షేక్ ఫాతిమా**

నా భర్త సుభాని చనిపోయాక పరామర్శకు వచ్చిన ఎమ్మెల్యే యరపతినేని.. ఆనాడు మాకు ఇచ్చిన భరోసాను రెండు నెలల్లో నిలబెట్టుకున్నారు. సొంతింటిని తిరిగి అప్పచెప్పడం నిజంగా ఆయ నకే సాధ్యమైంది. జీవితాంతం మా కుటుంబం ఆయనకు రుణపడి ఉంటుంది.

# లంచావతారంపై..ఆరా

- ట్రెజరీ ఉద్యోగిపై రాష్ట్ర డైరెక్టర్ సీరియస్!
- వివరణ కోరతామన్న జిల్లా అధికారులు
- సమాచారం లీక్ చేశారంటూ సిబ్బందిపై సాధింపులు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

తెనాలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఓ ఉద్యోగి లంచాల వేధింపులపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. 'అడిగినంత ఇస్తేనే బిల్లు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై.. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులే సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారే స్వయంగా తెనాలి వ్యవహారంలో వాస్తవాలపై వివరణ కోరినట్లు తెలిసింది. ఇదిట్లా ఉంటే.. జిల్లా ట్రెజరీ అధికారి చంద్రశేఖరరెడ్డిని దీనిపై ప్రశ్నిస్తే.. లంచాలకు పాల్పడిన ఉద్యోగి ఎవరనేది ఆరా తీస్తున్నామని తెలిపా రు. బాధితులెవరూ నేరుగా తమకు ఫిర్యాదు చేయలేదని, అయినా శాఖపరమైన విచారణ చేస్తున్నామని సమాధానం ఇచ్చారు. సంబంధిత ఉద్యోగికి నోటీసులు జారీ చేసి, వివరణ కోరనున్నట్లు పేర్కొన్నారు. అయితే బాధితులు ఆ ఉద్యోగి ఎవరనేది స్పష్టంగా తెలియజేస్తే.. నేరుగా విచారణకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు. మరోపక్క రెవెన్యూ అధికారులు కూడా ఆ ఉద్యోగి తీరుపై మండిపడుతున్నారు. తోటి ఉద్యోగి.. కనీస కనికరం లేకుండా తమ సిబ్బంది బిల్లుల విషయంలోనే దాడుణంగా వ్యవహరించడమే కాకుండా, జిల్లా కలెక్టర్‌నే కించపరిచే విధంగా మాట్లాడితే సహించబోమంటున్నారు. దీని పై శాఖపరంగా చర్యలకు దిగుతామంటూ వారూ హెచ్చరిస్తున్నారు. అటు మున్సిపల్ సిబ్బంది కూడా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆ శాఖ అధికారులకు విన్నవిస్తామని, సదరు ఉద్యోగిపై చర్యలకు డిమాండ్ చేస్తామని పేర్కొంటున్నారు. ఆంధ్రజ్యోతి కథనంతో.. కార్యాలయంలోని వివరాలు బయటకు ఎలా లీకయ్యాయని చిందులు తొక్కిన సదరు ఉద్యోగులిద్దరూ.. అనుమానం ఉన్న సిబ్బందిపై ప్రత్యక్షంగానే కక్ష సాధింపులకు దిగారని ఒకరిద్దరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ఉన్నతాధికారి కూడా అతనికే మద్దతిస్తూ వారిపై చర్యలు తప్పవంటూ బహిరంగంగానే హెచ్చరించారని బాధితులు చెబుతున్నారు. పత్రికల్లో కథనాలు రావడానికి తామే కారణమంటూ కక్ష సాధింపులకు దిగితే ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్తామని వారు చెబుతున్నారు.

# ఆలోచింపజేసిన నాటక ప్రదర్శనలు



27వ మైలురాయి నాటకంలోని ఓ సన్నివేశం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. పల్లెకోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మూడు నాటకాలను ప్రదర్శించారు. యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి '27వ మైలురాయి' నాటకం పీటీ మాధవ్ రచించగా ఆర్.వాసు దర్శకత్వం వహించారు. నిజం గెలుస్తుందన్న కథా సారాంశంతో ప్రారంభమైన నాటిక గెలుచేదంతా నిజం కాదు అనే ప్రధాన అంశంగా మైలురాయి నాటకం.. 1932లో జరిగిన యదార్థ ఘటనలు కళ్లకట్టింది. న్యాయవాదులు న్యాయం కోసం అన్న సంగతి మరిచిపోయి.. పేరుకు మాత్రమే న్యాయవాదులు అనే ఇతివృత్తంతో కూడిన ఈ నాటకం ప్రేక్షకుల ఆదరణ పొందింది. రెండవ ప్రదర్శన ఇచ్చిన.. సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి 'హక్కు' నాటికను యడారి సోమశేఖర్ రచించగా, మంజునాథ దర్శకత్వం వహించారు. సమాజంలో ఆస్తుల కోసం కుటుంబాల మధ్య జరుగుతున్న సంఘర్షణల సారాంశంగా రూపొందిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. మూడో ప్రదర్శన అరవింద్ తాడేపల్లి వారి 'విడాకులు కావాలి' నాటికను కొత్తూరు విజయలక్ష్మి, వల్లూరు శివప్రసాద్ రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు. నటీనటుల హావభావాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. నాటక ప్రదర్శనలకు వ్యాఖ్యాతగా అయినాల మల్లేశ్వరరావు వ్యవహరించారు. కళాకారులకు పరుచూరి వెంకటేశ్వరరావు, సినీనటి శివపార్వతి పారితోషికాలను అందజేశారు. వేజండ్ల బసవపున్నారావు, సాంబశివరావు, సతీష్, రామకోటేశ్వరరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# విద్య ఓ బ్రహ్మాస్త్రం..ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

- వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు
- "లైఫ్ ఆఫ్ కర్మయోగీ" పుస్తకావిష్కరణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సెక్రటరి ఎంటీ కృష్ణబాబు

పెదకాకాని, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి విద్య ఒక బ్రహ్మాస్త్రం అని రాష్ట్ర హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడితేనే జీవితంలో విజయం వరిస్తుందని ఆయన సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రచించిన "లైఫ్ ఆఫ్ కర్మయోగీ" పుస్తక సమీక్ష చర్చ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని, సమయాన్ని సోషల్ మీడియాలో దుర్వినియోగం చేసుకోకూడదని హితోపదేశం చేశారు. ఆరు దశాబ్దాల విలువలతో కూడిన నైతిక ప్రయాణ సివిల్ సర్వెంట్ ఎం.గోపాలకృష్ణ జ్ఞాపకాలే లైఫ్ ఆఫ్ కర్మయోగీ పుస్తకమని వ్యాఖ్యానించారు. పుస్తక రచయిత ఎం.గోపాలకృష్ణ భారతదేశ వ్యాప్తంగా తన సర్వీసులో ఎదురైన అనుభవాలు విద్యార్థులతో పంచుకున్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి వీఎస్ విష్ణు సభాధ్యక్షత వహించారు. అతిథులుగా ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, విశ్రాంత ఐజీ రవిచంద్ర పాల్గొన్నారు. ఏలూరి ఫౌండేషన్ చైర్మన్ ఏలూరి ప్రసాదరావు సమన్వయకర్తగా వ్యవహరించారు.

### రాజధాని నిర్మాణంతో
## భావితరాలకు బంగారు భవిష్యత్తు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంతో భావి తరాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హ యాంలో విధ్వంసానికి గురైన రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందని పే ర్కొన్నారు. రూ.65 వేల కోట్లతో.. 8,352 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతుందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రపంచం లోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందన్నారు. రాజధానిలో పునః నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయం అంచనాలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల రుణం మంజూరైందని, జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంక్ కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు రుణం పొందేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం రూ.15,400లు కోట్లు అమరావతి నిర్మాణానికి హడ్కో రుణ సదుపాయం కల్పించడం హర్షణీయమన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్త యితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతాయని తెలిపారు. రాజధానిలో నిర్మాణాలు పోగా రూ.2 లక్షల కోట్లకు పైన విలువైన మిగులు భూములు ఉన్నాయని తెలిపారు. పదేళ్ల తర్వాత సైబరాబాద్ తరహాలో.. ఇక్కడా భూముల విలువ ఎకరం రూ.50 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు.

## అపరాధ రుసుంతో.. సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు

- రీ వెరిఫికేషన్‌కు నేటితో ఆఖరు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి రెగ్యులర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించాలని డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 19 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, మూడు సబ్జెక్టులకు రూ.110, మించితే రూ.125 చెల్లించాలని పేర్కొన్నారు. ఫీజు చెల్లింపు గడువు బుధవారంతో ముగియడంతో.. గురువారం నుంచి పరీక్ష ముందు రోజు వరకు రూ.50 ఆలస్య రుసుముతో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. రీకౌంటింగ్ కోసం సబ్జెక్టు రూ.500లు, రీ వెరిఫికేషన్ కోసం సెబ్జెక్టుకు రూ.1000లు సదరు పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు గురువారం రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని డీఈవో తెలిపారు.

### దూర విద్యలో సప్లిమెంటరీ ఫీజు ఇలా..

దూరవిద్యలో ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని డీఈఓ ఎల్.చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీలో సబ్జెక్టుకు రూ.వంద, ఇంటర్మీడియెట్‌లో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.వంద చొప్పున అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లింపునకు బుధవారంతో గడువు ముగిసిందన్నారు. అపరాధ రుసుముతో సబ్జెక్టుకు రూ.25 లెక్కన గురు, శుక్రవారం, రూ.50తో మే 3 నుంచి 4వ తేదీ వరకు, తత్కాల్ రుసుం పదవ తరగతికి రూ.500, ఇంటర్మీడియెట్‌కు రూ.1000 అని తెలిపారు. ఓపె న్ స్కూల్ వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రీకౌంటింగ్ కోసం జవాబు పత్రానికి రూ.200, రీవేరిఫికేషన్‌కు రూ.1000లు ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ లో మాత్రమే నేరుగా చెల్లించాలని తెలిపారు. డీడీ, ఇతర చెల్లింపులు అంగీకరిం చబడవని డీఈవో తెలిపారు.

## ప్రత్యేక న్యాయవాది నియామకం

**అమర్నాథ్‌గౌడ్ హత్య కేసులో కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం**

**ప్రాసిక్యూషన్ ప్రత్యేక న్యాయవాదిగా కావూరి గోపీనాథ్**

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అమర్నాథ్‌గౌడ్ హత్య కేసుకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్‌కు సహకరించడానికి హైకోర్టు న్యాయవాది కావూరి గోపీనాథ్‌ను ప్రత్యేకంగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పదో తరగతి చదువుతున్న ఉప్పాల అమర్నాథ్‌గౌడ్‌ను 2023 జూన్ 16న అతికిరాతకంగా పెట్రోలు పోసి తగలబెట్టిన ఘటన చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామ పరిధిలో జరిగిన సంగతి తెలిసిందే. బాలుడి హత్యకు సంబంధించి కేసు నమోదు దగ్గర నుంచి ప్రాసిక్యూషన్ వాదనల వరకు గత ప్రభుత్వం అడుగడుగునా నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు కూడా అమలుకు నోచుకోలేదు. వీటి ఫలితమే ఆ దారుణమైన కేసులో నిందితులు 45 రోజుల వ్యవధిలోనే బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు విషయంలో గత ప్రభుత్వ వైఖరిని టీడీపీ తీవ్రంగా ఆక్షేపించింది. అధికారంలోకి రాగానే బాలుడు అమర్నాథ్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన హామీలో భాగంగా ఈ ప్రత్యేక నియామకం జరిగింది.

### కులగణన ఆర్థిక సమానత్వానికి దోహదం: పెమ్మసాని

గుంటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జనగణనలో కులగణన కార్యక్రమం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదం చేస్తుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రగతికి, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే సంకల్పానికి కులగణన ఒక మార్గదర్శిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక గొప్ప మార్పుకు సంకేతకంగా మారు తుందని, సామాజిక అసమానతలను చెరిపివేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ప్రాణం తీసిన రూ.3వేల అప్పు

అచ్చంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన ఎస్కే సలీం(25) బుధవారం తెల్లవారుజామున గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చింతపల్లి గ్రామానికి చెందిన యువకులకు రూ.3వేలు చెల్లించలేదని సలీం సెల్ ఫోన్ తీసుకున్నారు. దీంతో నామోషీగా ఫీల్ అయిన సలీం మూడు రోజుల క్రితం ఎలుకల మందు తాగాడు. ఆసుపత్రిలో చేర్పించడంతో.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అచ్చంపేట పోలీసులు తెలిపారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 248.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 258.00 |

## 1,29,339 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,19,395 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,29,339 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 42,556 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | తేజ | 10000 | 13700 |
| 334 | 9500 | 13200 | షార్క్-1 | 10000 | 12000 |
| నంబరు.5 | 10000 | 12500 | బ్యాడిగి 355 | 10000 | 13000 |
| 273 | 10000 | 12400 | సింజెంటా బ్యాడిగి 5531 | --- | --- |
| 341 | 10000 | 13300 | దేవనూరుడీలక్స్ | 10000 | 12600 |
| 4884 | 10000 | 11200 | ఆర్మూరు | 9800 | 11200 |
| సూపర్10 | 10000 | 12500 | తాలుకాయలు | 4500 | 6500 |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | | | |

## ముప్పలనేని'స్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంకరోడ్డులో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ముప్పలనేని'స్ ఫిల్లింగ్ స్టేషన్‌ను బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ లాంఛనంగా ప్రారంభించారు. ఆక్వా రైతులకు, సూర్యలంకబీచ్‌కు వచ్చే పర్యాటకులకు అందుబాటులో ఉండేవిధంగా ఫిల్లింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు మందపాటి ఆంద్రేయ, తాతా హరిశ్చంద్రప్రసాద్, ముప్పలనేని శేషసుమంత్, జి.గిరిజారాణి, తాళ్ళూరి రామకృష్ణ, మాజీ ఎంపీపీ దాసరి యోహాను, బండిరామ్మూర్తినాయుడు, మునేశ్వరరావు, శివాజీ, పిండిమర కృష్ణ, జీవీ బ్రహ్మం, బొడ్డు సుబ్బారెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



ముప్పలనేని'స్ ఫిల్లింగ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

## హిందూ ధర్మరక్షణకు కృషి చేయాలి

● సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసు

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసుల శ్రీనివాసు పిలుపునిచ్చారు. బాపట్ల పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమరసత సేవాఫౌండేషన్ సమావేశం జరిగింది. సమావేశానికి శ్రీనివాసు అధ్యక్షత వహించి మాట్లాడుతూ హనుమత్‌జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటూ హనుమంతుని స్ఫూర్తిగా హిందూ ధర్మరక్షణకు కృషి చేయాలన్నారు. మే 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మండల సమావేశాలు, 10వ తేదీ రెండో శనివారం సత్సంగం నిర్వహించాలన్నారు. 8, 23 తేదీలలో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమం, 22వ తేదీన హనుమత్ జయంతోత్సవాలు నిర్వహించాలని జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి తెలిపారు. 12వ తేదీన వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని అన్ని దేవాలయాలలో సామూహిక హారతులు, మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, కన్వీనర్లు బొలగాని వెంకటేశ్వర్లు, చిల్లా సత్యనారాయణ, మోదడుగు సూరిబాబు, అంకారావు, కొత్రా పద్మ, వేముల రోజారాణి, శ్రీదేవి, సుజాత లక్ష్మీ, చింతల మురళీకృష్ణ, అక్కల సుబ్బారెడ్డి, తులసీ రాజేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమరసత సేవాఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసు

## భక్తి, జ్ఞాన, కర్మ మార్గాల ద్వారా ముక్తి

● వాసుదేవానందస్వామిజీ



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వాసుదేవానందస్వామిజీ

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : భక్తి, జ్ఞాన, కర్మ మార్గాల ద్వారా ముక్తి లభిస్తుందని వాసుదేవానందస్వామిజీ అన్నారు. పట్టణంలోని బాలకృష్ణపురం తపోవనం ఆశ్రమంలో నిర్వహిస్తున్న ఈశావాస్యోపనిషత్‌పై జ్ఞానయజ్ఞ కార్యక్రమం ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడుతూ మే 2వ తేదీ శంకరాచార్య జయంతి వరకు ఈశావాస్యో ఉపనిషత్తుపై జ్ఞాన యజ్ఞ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 6.30 నుంచి 7.30 వరకు, సాయంత్రం 6.30 నుండి 7.30 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకా సత్యనారాయణ, ముంతా గోవిందరాజులు, పి.అప్పారావు, బాపనపల్లి భ్రమరాంబ, సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్‌లు, భక్తులు పాల్గొన్నారు.

## నమ్మక్కళ్ నుంచి ప్రపత్త్యాంజనేయస్వామి దేవాలయానికి మెటీరియల్

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్యలంక రోడ్డులో ఉన్న పురాతన ప్రసిద్దిగాంచిన శ్రీసువర్చలా సమేత శ్రీప్రపత్త్యాంజనేయస్వామి దేవాలయ నూతన నిర్మాణ పనులకు అవసరమైన మెటీరియల్‌ను తమిళనాడు రాష్ట్రంలోని నమ్మక్కళ్ నుంచి తీసుకొచ్చారు. ఎంతోకాలంగా ఆ ప్రాంతంలో దేవాలయం ముఖమండపం నిర్మాణానికి అవసరమైన విలువైన రాళ్ళను చెక్కి లారీలలో తీసుకొచ్చారు. బుధవారం ఇంజనీరింగ్ కళాశాల దగ్గరకొచ్చిన లారీలకు స్వాగతం పలికి శాస్త్రోక్తంగా పూజలు జరిపి తీసుకొచ్చారు. అదేవిధంగా శ్రీనివాస థియేటర్ దగ్గర, గడియారస్తంభం దగ్గర, సూర్యలంకరోడ్డులోని ఆలయం దగ్గర పూజలు నిర్వహించి మెటిరియల్ తీసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు పూసపాటి శ్రీకాంత్, మోదడుగు నరేష్ గుప్తా, కోటా బ్రహ్మయ్య, దుద్దుకూరి హనుమంతరావు, నెమలికంటి హనుమంతరావు, బి.బాబు నాగేంద్ర, ఆలయ అర్చకులు విఖనసమూర్తి తదితరులు ఉన్నారు.



లారీలో వచ్చిన మెటీరియల్‌ను పూజలు చేసి తీసుకెళుతున్న కమిటీ సభ్యులు, పండితులు

## కష్టజీవుల కవి శ్రీశ్రీ చిరస్మరణీయులు



శ్రీశ్రీ మహాప్రస్థానం పాకెట్ పుస్తకాన్ని విడుదల చేస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు తదితరులు

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు కవిత్వాన్ని కదం తొక్కించిన కష్టజీవుల కవి శ్రీశ్రీ చిరస్మరణీయులని ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. శ్రీశ్రీ 115వ జయంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో మహా ప్రస్థానం పాకెట్ పుస్తకాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ అక్షరాలను అణుబాంబులుగా పేల్చినకవి శ్రీశ్రీ అన్నారు. మహాప్రభంజనం సృష్టించిన ఆయన మహాప్రస్థానానికి 75 వసంతాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణరావు, అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కలాం, లావణ్య, నైమిశా, పద్మజ, సుశీలావతి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక కవితా వైతాళీకుడు శ్రీశ్రీ : రావూరి

తెలుగు సాహితీ జగత్తులో శ్రీశ్రీ ఒక నూతన ప్రభంజనాన్ని సృష్టించారని, ఎక్కడో ఊహలోకాల్లో విహరిస్తున్న తెలుగు సాహిత్యాన్ని వాస్తవ లోకంలోకి తీసుకొచ్చిన ఆధునిక కవితా వైతాళీకుడు శ్రీశ్రీ అని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బుధవారం శ్రీశ్రీ 115వ జయంతి సభలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, సాహితిభారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, సాహితీవేత్త షేక్ జిలానీ, సాహితీభారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్ సంయుక్తంగా మాట్లాడుతూ శ్రీశ్రీ 280 చిత్రాలకు 1000కి పై చిలుకు పాటలు రచించారని, శ్రీశ్రీ రచించిన 'తెలుగు వీర లేవరా' అనే పాటకు కేంద్ర ప్రభుత్వ అవార్డు లభించిందని తెలిపారు. అనంతరం రచయితలు కామరాజు కాళిదాసు, బొడ్డపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# 30 రోజులు.. రూ.3.35 కోట్లు

● 34 శాతం వసూళ్ళతో గ్రేడ్-1 మున్సిపాలిటిలలో 3వ స్థానం

బాపట్ల, ఏప్రిల్ 30 : (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘానికి సంబంధించిన ఆర్థిక వనరులను మెరుగుపర్చుకోవటంలో భాగంగా మున్సిపల్ అధికారులు పన్ను వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి రెవెన్యూసిబ్బందితో కలిసి వార్డులలో పర్యటించి మొండి బకాయిలు సైతం వసూళ్ళు చేస్తున్నారు. బాపట్ల పురపాలక సంఘం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఎరియర్స్‌తో కలిపి 9కోట్ల 23లక్షల రూపాయలు పన్ను వసూళ్ళు చేయాల్సి ఉంది. ప్రభుత్వం పాతబకాయిలకు సంబంధించి వడ్డీపై 50 శాతం రాయితీ ఏప్రిల్ నెలకు కూడా పొడిగించింది. అదేవిధంగా కరెంట్‌బిల్లులకు సంబంధించి 5శాతం పన్నురాయితీ కల్పించింది. దీనిపై మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బార్, ఆర్‌ఐలు జి.శివరామకృష్ణ, షేక్.ఇమామ్, సచివాలయ సిబ్బందితో కలిసి వార్డులలో విస్తృత ప్రచారం చేశారు. సకాలంలో చెల్లించండి రాయితీ పొందండంటూ చేసిన ప్రచారంపై పన్ను చెల్లింపుదారులు స్పందించి స్వచ్ఛందంగా కార్యాలయాలకు వచ్చి పన్ను చెల్లించారు. కరెంట్ బిల్లులకు సంబంధించి రూ.2 కోట్ల 31 లక్షలు, ఎరియర్స్ బిల్లులకు సంబంధించి రూ.కోటి 4 లక్షలు చెల్లించారు.



బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం

దీంతో మొత్తం 30 రోజుల్లో రూ.3 కోట్ల 35 లక్షలు పన్ను చెల్లించటంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రాష్ట్రంలోని 16గ్రేడ్-1 మున్సిపాలిటిలలో 34 శాతం వసూళ్ళతో బాపట్లకు మూడో స్థానం లభించింది. దీంతో కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బంది పనితీరును అభినందించారు. ఇదేస్ఫూర్తితో పనిచేయాలని సిబ్బందికి సూచించగా పట్టణాభివృద్దిని దృష్టిలోపెట్టుకొని ప్రజలు సకాలంలో పన్ను చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉమాసుందరిగా శ్రీ బగళాముఖి అమ్మవారు



ఉమాసుందరి మహాదేవి అలంకరణలో శ్రీ బగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ళ మహోత్సవాలలో భాగంగా తొలిరోజు బుధవారం అఖండజ్యోతి దీపారాధనతో అంగరంగ వైభవంగా తిరునాళ్ళ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీ బగళాముఖి అమ్మవారికి వేదమంత్రాలతో తెల్లవారుజామున అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. అనంతరం శ్రీఉమాసుందరి మహాదేవిగా అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. శ్రీబగళాముఖి అమ్మవారికి వీరాచారా ఆచారవంతుల సంప్రదాయం ప్రకారం వివిధ రకాల సేవలందించారు. అమ్మవారి ప్రతిరూపాలైన పావనం, ఘటంతో చందోలు, కొత్తరెడ్డిపాలెం సంగం గ్రామ ప్రాంతాలలో అమ్మవారిని ఊరేగింపుగా నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ ఉత్సవ కార్యక్రమాలలో పెనుగొండ కేశవరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనసూయ మహాదేవి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

బాపట్లరూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రం జిల్లెళ్ళమూడి గ్రామంలో మాతృశ్రీ అనసూయ మహాదేవి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో పసుపు దంచుతూ ప్రారంభించి అనంతరం అమ్మకు మంగళహారతులు అర్పించారు. విశ్వజననీ జిల్లెళ్ళమూడి అమ్మ, బ్రహ్మాండం నాగేశ్వరరావుని వివాహమాడిన 90వ పెళ్ళి వేడుకలలో మొదటిరోజు ముత్తాయిదువులందరూ పసుపుకొట్టగా, రానున్న మూడు రోజుల్లో పెళ్లి కూతురు, పెళ్లి కొడుకును చేసే కార్యక్రమాలు జరుగుతాయని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అదేవిధంగా మే 5న అంగరంగ వైభవంగా జిల్లెళ్ళమూడిలో అనసూయ నాగేశ్వరుల కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు చుట్టు పక్కల గ్రామాలు నుంచేకాకుండా తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి అమ్మ భక్తులు జిల్లెళ్ళమూడి చేరుకుంటారని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.




దాసరి సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తదితరులు

## సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయం

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏఎస్ఐ దాసరి సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయమని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు. సుదీర్ఘకాలంపాటు పోలీసుశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న సుబ్రహ్మణ్యం దంపతులను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ 34 సంవత్సరాల పాటు సేవలందించిన సుబ్రహ్మణ్యంను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పదవీవిరమణ తర్వాత కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆకాంక్షించారు. అనంతరం ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ సారధి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్ పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి పర్యటన విజయవంతం చేయాలి : ఎంపీడీవో

కర్లపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ప్రధాన మంత్రి మోదీ పర్యటన విజయవంతం చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. సభకు కర్లపాలెం మండలం నుంచి జన సమీకరణ కోసం 17 బస్సులలో నాయకులు, ప్రజలు తరలివెళ్ళటం జరుగుతుందని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని బస్సులలో కావాల్సిన అన్ని సౌకర్యాలు భోజనం, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, ప్రాథమిక చికిత్స కిట్లను ఉంచడం జరుగుతుందని ఎంపీడీవో చెప్పారు. మోడీ పర్యటన అనంతరం తిరిగి ప్రజలను సురక్షితంగా తీసుకువస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాసులరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఏఎస్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

## జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిగా రత్నమన్మోహన్



రత్నమన్మోహన్

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిగా డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించి రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిగా బాపట్లలో నియమించబడ్డారు. ఈసందర్భంగా ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

## ఐ అండ్ పీఆర్ ఏడీగా మోహనరాజు



టి.మోహనరాజు

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా టి.మోహనరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మోహనరాజు బాపట్ల జిల్లా ఏర్పడిన నాటి నుంచి డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా రెండు సంవత్సరాలు పని చేశారు. అనంతరం 2024 జనవరిలో జిల్లా పౌరసంబంధాల అధికారిగా పదోన్నతిపై నెల్లూరు జిల్లాకు వెళ్ళారు. నవంబరులో డిప్యూటేషన్‌పై బాపట్ల జిల్లాకు ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కె.సుభాషిణి స్వచ్ఛంద పదవీవిరమణ చేయటంతో ఆమె స్థానంలో మోహనరాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ అధికారులు, నాయకుల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ప్రజలకు తెలియజేయటంతోపాటు పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పద్మావతి, రవి, సుభానీ, కిరణ్ తదితరులు అభినందనలు తెలిపారు.

## విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి తగ్గించాలి

● స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నాయకులు

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉపాధ్యాయుల ట్రాన్స్‌ఫర్‌లు, ప్రమోషన్‌లు జరగనున్న నేపథ్యంలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి తగ్గించాలని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పిచ్చయ్య, సీహెచ్‌టీవీ సురేష్ అన్నారు. వారు బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్స్‌ను 9 రకాలుగా విభజన చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:45 ఉండాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా ప్రతి పాఠశాలకు 2 ఎస్‌జిటి పోస్టులు కేటాయించాలన్నారు. డీఎస్సీ ద్వారా వచ్చిన వారిని క్లస్టర్‌లో అదనపు టీచర్స్‌గా నియమించాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలకు విద్యార్థులతో నిమిత్తం లేకుండా ప్రధానోపాధ్యాయులు అన్ని సబ్జెక్ట్‌లకు స్కూల్ అసిస్టెంట్‌లు, పీడీ పోస్టులు కేటాయించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్స్‌ను నియమించాలన్నారు. అదనంగా ఉన్న స్కూల్ అసిస్టెంట్‌లను ఉన్నత పాఠశాలలో రేషియో తగ్గించటం ద్వారా ప్రాథమికోన్నత పాఠశాల సబ్జెక్ట్ టీచర్స్‌ను వాటికి వాడటం ద్వారా అదనపు స్కూల్ అసిస్టెంట్‌ల సమస్యను పరిష్కరించాలన్నారు.

## బాల్యవివాహాల నియంత్రణకు పెద్దలు కృషి చేయాలి

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలు జరగకుండా పెద్దలు ప్రముఖ పాత్రపోషించాలని సీఫార్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ కో ఆర్డినేటర్ బడుగు కిషోర్ తెలిపారు. అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా మసీదులు, దేవాలయాలు, చర్చిలలో పెద్దలను సంప్రదించి వారిని చైతన్య పరిచి బాల్య వివాహాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. సీఫార్డ్, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కొమరబత్తిన రవిప్రదీప్, పి.మౌనిక, జి.సుకన్య, పి.మరియజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న సంఘ కాపరులు, నిర్వాహకులు

### పేటేరు గ్రామంలో..

రేపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని జిల్లా బాలికల సంరక్షణాధికారి కృష్ణ అన్నారు. మండలంలోని పేటేరు గ్రామంలోని భావన్నారాయణస్వామి ఆలయంలో బాల్యవివాహాలపై ప్రజలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండినవారికే వివాహాలు చేయాలని లేని యెడల బాల్యవివాహాల నిరోధకచట్టం 2006 ప్రకారం రూ.లక్ష జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్షపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఎం.సుచిత్ర, పీఎస్ శ్రీనివాసరావు, కార్తీక్, ఎం.మురళి, ధనుంజయరావు, సురేష్, నటరాజ్‌లు పాల్గొన్నారు.

### చెరుకుపల్లిలో..

చెరుకుపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, పల్లపట్ల ఆధ్వర్యంలో బుధవారం కిశోరీ వికాసం సమ్మర్ క్యాంపైన్ నిర్వహించారు. సీడీపీవో ఎం.అనసూయ మాట్లాడుతూ గ్రామాల్లో 15 నుంచి 18 సంవత్సరాల ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేయడం వల్ల వచ్చే నష్టాలు, చదువు ప్రాముఖ్యత, ఆరోగ్యం మొదలగు విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రచారం ఈనెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారాలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వీఏవోలు, అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ మంగ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగ

రేపల్లె, ఏప్రియల్ 30(ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించి మెరుగైన వసతులను కల్పించటమే ముఖ్య ఉద్ధేశ్యమని మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీరు సమృద్ధిగా అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పురపాలకసంఘానికి పెండింగ్ ఉన్న బకాయిలను వెంటనే చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 27 అంశాలను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, వైస్ ఛైర్మన్‌లు టీకేవీ గుప్తా, ప్రశాంత్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పోదం పద మోదీ సభకి

● రేపటి రాజధాని సభకు భారీగా తరలనున్న జనం

● 360 బస్సుల్లో 16,000 మంది తరలింపునకు ఏర్పాట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో వేడుకలా జరగనున్న అమరావతి పునఃశంకుస్థాపన మహోత్సవంలో పాల్గొనేందుకు జిల్లావాసులు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను జిల్లా అధికారులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 360 బస్సుల్లో 16,000 మందిని తరలించనున్నారు. నియోజకవర్గానికి 60 బస్సులు చొప్పున కేటాయించి, పర్యవేక్షించడానికి మండలానికో ఓ స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు. వీరికి అదనంగా కూటమి పార్టీల నేతలు కూడా జనాన్ని తరలించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మొత్తంగా జిల్లా నుంచి 40,000 మంది వరకు అమరావతి సభకు హాజరవుతారనేది అంచనా. మరో వైపు సభ ఏర్పాట్లలో భాగంగా జిల్లాకు చెందిన ముగ్గురు ఆర్డీవోలు, పది మంది తహసీల్దార్లతో పాటు వివిధ విభాగాల జిల్లా అధికారులు సభాస్థలి వద్ద విధుల్లో నిమగ్నమై ఉన్నారు. ఎస్పీ తుషార్‌డూడీతో పాటు జిల్లాకు చెందిన దాదాపు 450 మంది పోలీసు సిబ్బంది అమరావతి సభ బందోబస్తు విధులకు ఇప్పటికే తరలివెళ్లారు. శుక్రవారం ఉదయం 8 గంటలకే ఆయా ప్రాంతాల్లో బస్సులు సిద్ధంగా ఉండనున్నాయి. ఒక్కో బస్సు పర్యవేక్షణకు ఆశా కార్యకర్త, ఏఎన్ఎం, పోలీస్ అందుబాటులో ఉండనున్నారు. బస్సుల్లో వెళ్లే వారికి భోజనం అందించడానికి మార్గమధ్యలో నాలుగు చోట్ల పాయింట్లను ఏర్పాటు చేశారు. అమరావతి సభకు జిల్లా నుంచి తరలివెళ్లే బస్సులతో పాటు ఎప్పటికప్పుడు ప్రజలకు అందే సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించడానికి 30 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం వరకు ఈ కంట్రోల్ రూం సేవలు అందుబాటులో ఉండనున్నాయి. జిల్లా నుంచి తరలివెళ్లే వారికి భోజన సదుపాయాలను డీఎస్‌వో విలియమ్స్ సారథ్యంలోని నలుగురు అధికారుల బృందం పర్యవేక్షించనుంది.



సమావేశంలో పాల్గొన్న జిల్లా నేతలు

### జిల్లా నేతలు తాడేపల్లిలో సమావేశం

శుక్రవారం జరగనున్న ప్రధాని మోదీ సభ ఏర్పాట్లపై చర్చించడానికి జిల్లాకు చెందిన నేతలు బుధవారం తాడేపల్లిలో సమావేశమయ్యారు. ఇన్‌చార్జి మంత్రి కొలుసుపార్థసారథి, మంత్రులు అనగాని, గొట్టిపాటితో పాటు ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## అమరావతి పునర్నిర్మాణ సభ జయప్రదం చేయాలి

రేపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననున్నారని, నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకులు జీవీ నాగేశ్వరరావు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమరావతి సభకు తరలివెళ్ళే వారి కోసం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. సభకు నియోజవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు రేపల్లె రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభి రామారావు, టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, గోలి రామశేషు, వడ్డి లక్ష్మోజీ, కొపనాతి రాజశేఖర్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవీ నాగేశ్వరరావు తదితరులు

## రేపటి నుంచి వేద ప్రవర్ధక విద్వత్పరీక్షా సభలు

కొల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు మండల వేద ప్రవర్ధక విద్వత్పరీక్షా సభలు మే 2వ తేదీ నుంచి 5 వరకు నిర్వహిస్తున్నట్లు గుంటూరు ధర్మ పరిపాలన సంఘం నిర్వాహకులు బుధవారం తెలిపారు. కొల్లూరులోని పార్వతీ సంస్కృత పాఠశాల ఆధ్యాత్మిక మండపంలో మే 2న శంకర జయంతి పురస్కరించుకుని ఉదయం 7 గంటలకు ఆదిశంకరాచార్యులు, రామచంద్రేంద్ర సరస్వతీ యతీశ్వరుల చిత్రపటాలతో ఊరేగింపు, 7.30 గంటలకు జగద్గురు శంకరాచార్య విశేష పూజ, 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేద విద్యార్థులకు పరీక్షలు, 3వ తేదీన వేద విద్యార్థులకు పరీక్షలు, 4వ తేదీన పరీక్షలతో పాటు అధ్యాపకుల పండిత్వ ప్రకర్ష, విద్యారణ్య పండితుని ఉపన్యాసం, 5న వేదస్వస్తి, వేదపండితుల సన్మాన సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 5న జరిగే సన్మాన సభకు సభాధ్యక్షులుగా గబ్బిట శివరామకృష్ణప్రసాద్, ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వై.లక్ష్మణరావు, విశిష్ట అతిథిగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు గుంటూరు రేంజ్ సర్వశ్రేష్టి త్రిపాఠి పాల్గొంటారన్నారు. ఉత్తీర్ణులైన వేద విద్యార్థులకు జయ పత్ర ప్రోత్సాహక బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. వేద సభలకు వేద పండితులు, విద్యార్థులు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## పూడివాడ ఉత్తరపాలెంలో మట్టి అక్రమ తవ్వకాలు

నగరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పూడివాడ ఉత్తరపాలెంలో సుమారు రెండు ఎకరాల పొలంలో రెండు జేసీబీల సహాయంతో భారీగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్లు, టిప్పర్ల సహాయంతో మట్టిని రవాణా చేస్తున్నారు. పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరపటంతో స్థానిక ప్రజలు సైతం అభ్యంతరం వ్యక్తపరుస్తున్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌ను వివరణ కోరగా స్థానిక వీఆర్‌వో ఉదయలక్ష్మి పోలీసుల సహాయంతో మట్టి తవ్వకాలు నిలుపుదల చేసి రెండు ఇసుక ట్రాక్టర్లను, రెండు టిప్పర్లను సీజ్ చేసి తరలిస్తున్నామని తెలిపారు. ఇలాంటి మట్టి తవ్వకాలు జరిపితే సహించేది లేదని హెచ్చరించారు.

## మున్నంవారిపాలెంలో వేసవి యోగా శిబిరం

బాపట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్నంవారిపాలెం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయ సమీపంలో వేసవియోగా శిబిరం బుధవారం ప్రారంభించారు. ఇండియన్ యోగా ఫెడరేషన్ జాయింట్ సెక్రటరి, ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ చీఫ్ సెక్రటరి అల్లాడి రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కావూరి నాగేశ్వరరావు, శ్రీధర్, నాయుడు మల్లికార్జునరెడ్డి, రాజు ఆనందరెడ్డి, గొర్ల బాజిబాబు పాల్గొన్నారు.

## మద్దతు ధరకు అపరాల కొనుగోలు : ఏవో

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అపరాల కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.లక్ష్మీప్రసన్న తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఏవో మాట్లాడుతూ, అపరాలతో పాటు వారం రోజుల్లో తెల్లజొన్న కొనుగోలు కేంద్రం కూడా భట్టిప్రోలు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెల్లజొన్న పండించిన రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.3371 లకు అమ్ముకోవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు అయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. మట్టి నమూనా పరీక్షలు చేయించుకునే రైతులు కూడా కేంద్రాల సిబ్బందికి తెలియజేసి భూసార పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని ఏవో తెలిపారు.

# ఫలించని.. ఈ-శ్రమ్



పథకాలు ప్రారంభించడమే కాదు.. వాటి అమలుకు ఆర్థిక దన్ను ప్రభుత్వాలు అందించాలి. ఫలాలు లబ్ధిదారులకు అందాయో..లేదోనని పర్యవేక్షించాలి. లేకుంటే అవి ఎలా నిరర్థకమవుతాయో.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-శ్రమ్ పథకం అందుకు ప్రత్యక్ష నిదర్శనం. కరోనా కల్లోలంలో విలవిల్లాడి పోయిన అసంఘటిత కార్మికుల దుస్థితిని చూసి.. వారిని సంఘటితంగా అభివృద్ధి చేసేందుకు ఈ-శ్రమ్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. కార్మికుల వివరాలు అందులో పొందుపరిచి.. వారికి అన్ని ప్రయోజనాలు లభించేలా పథకం ప్రారంభమైన.. నాలుగేళ్లకు లబ్ధి పొందింది ఉమ్మడి ఉంటూరు జిల్లాలో ఇద్దరే అంటే.. పరిస్థితి అర్థమవుతుంది. దీంతో అసంఘటిత కార్మికులు కూడా.. ఈ పథకంపై నిరాసక్తత వ్యక్తపరుస్తున్నారు... మేడే సందర్భంగా విఫలమైన.. ఈ-శ్రమ్ పథకంపై ప్రత్యేక కథనం.

## నేడు మేడే సందర్భంగా ప్రత్యేక కథనం..

గుంటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు అండగా నిలవడం కోసం రూపొందించిన 'ఈ- శ్రమ్' పథకం కేవలం ప్రచారానికే పరిమితమైపోయింది. కరోనా కాలంలో ఎలాంటి భద్రత లేని కార్మికుల కోసం ప్రారంభించిన పథకం ఆచరణలో పూర్తిగా విఫలమయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఈ- శ్రామిక్ పోర్టల్‌ను అట్టహాసంగా ప్రారంభించి, ఆ తర్వాత పట్టించుకోక పోవడంతో పథకం పూర్తిగా నీరుగారిపోయింది.

### కార్డు ప్రయోజనాలు..

కరోనా లాక్‌డౌన్ పరిస్థితుల అనంతరం.. 2021 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఈ- శ్రామిక్ పోర్టల్ ద్వారా 'ఈ- శ్రమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ వంటి సదుపాయాలు లేని అసంఘటిత కార్మికుల భవిష్యత్తు భద్రత కోసం ఈ పథ కాన్ని రూపొందించింది. కార్మికుల వివరాలను సేకరించి ఈ- శ్రామిక్ పోర్టల్లో అప్‌లోడ్ చేసి వారికి 'ఈ- శ్రమ్' గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఈ కార్డు తీసుకున్న కార్మికులకు సంఘటితరంగ కార్మికులతో సమానంగా ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పారు.

- కార్మికులు ప్రమాదానికి గురై పాక్షిక దివ్యాగులుగా మారితే కేంద్ర ప్రభుత్వం రూ. లక్ష చెల్లిస్తుంది.
- శాశ్వత వైకల్యం లేదా మరణం సంభవిస్తే కార్మికుడి కుటుంబానికి రూ.2 లక్షలు బీమా కవరేజీ వస్తుంది.
- ఇన్సూరెన్సు మాత్రమే కాకుండా, పిల్లలకు ఉచితంగా సైకిళ్లు, పనిముట్లు, కుట్టు మిషన్లు ఇతర ఆర్థిక సహకారం అందిస్తుంది.

### వీరంతా అర్హులే

ఈ- శ్రమ్ కింద అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులంతా అర్హులే. 16 నుంచి 59 ఏళ్లలోపు ఉంటేనే ఈ పథకం పరిధిలోకి వస్తారు. పరిశ్రమల్లో దిన కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, సున్నం, ఇటుక బట్టీల కార్మికులు, కార్పెంటర్లు, పెయింటర్లు, వీధి వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, టైలర్లు, మెకానిక్‌లు సహా పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని, రేషన్ కార్డుదారులు అర్హులు.

- అసంఘటిత కార్మికులకు అక్కరకురాని కార్డులు
- కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పరిష్కారం కాని క్లెయిములు
- ప్రీమియం చెల్లించకపోవడంతో స్కీమ్ నిరుపయోగం
- గడిచిన నాలుగేళ్లలో 2 వేలకు పైగా క్లెయిములు
- పరిష్కారానికి నోచుకుంది 2 మాత్రమే!
- జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు 20 లక్షలకు పైమాటే
- 'ఈ- శ్రమ్' కార్డులు పొందింది 2.20 లక్షల మందే..




### అక్కరకురాని కార్డులు, అనాసక్తి

అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 20 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఉంటారని అంచనా. అందులో 15 శాతం మందికి కూడా ఈ- శ్రమ్ కార్డులు లేవు. జిల్లా వ్యాప్తంగా 2.20 లక్షల మందికి మాత్రమే ఈ కార్డులు ఉన్నాయి. మిగిలినవారు కార్డులు తీసుకునేందుకు అనాసక్తి చూపుతున్నారు. అందుకు కారణం గడిచిన నాలుగేళ్లలో ఈ-శ్రమ్ క్లెయిమ్‌లు ఒక్కటి కూడా పరిష్కారం కాకపోవడమేనని తెలుస్తోంది. 2021 నుంచి ఇప్పటి వరకూ జిల్లా కార్మిక శాఖకు 2 వేలకు పైగా క్లెయిమ్‌లు రాగా, అందులో కేవలం 2 మాత్రమే పరిష్కారమై, ఇద్దరికి మాత్రమే ప్రయోజనం దక్కినట్లు తెలుస్తోంది. 2022 మార్చిలోపు దరఖాస్తు చేసుకున్న వారిలో ఆ ఇద్దరికి తప్ప ఎవరికీ ప్రయోజనాలు దక్కలేదని కార్మికులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంకు చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం నిరర్థకమైపోయిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి సహాయం రాకపోగా ఈ- శ్రమ్ కార్డు దరఖాస్తు కోసం తమ సొంత డబ్బే ఖర్చు చేయాల్సి వస్తోందని, ప్రయోజనం లేని పథకం కోసం ఖర్చు చేయడం ఎందుకని పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా తక్షణమే ఈ- శ్రమ్ క్లెయిములను పరిష్కరిం చాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



### దరఖాస్తు ఇలా

అర్హులైనవారు 'ఈ-శ్రమ్' కార్డుకోసం 'ఈశ్రమ్.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే సమీపంలో ఉన్న మీ-సేవ కేంద్రాల్లో అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డుతో లింకైన మొబైల్ నంబరుతో పేరును రిజిష్టర్ చేసుకోవాలి. మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి లాగిన్ అవ్వాలి. అనంతరం అడ్రస్, విద్యార్హతలు ఇతర వివరాలు నమోదు చేయాలి. ఏ పనిలో నైపుణ్యం ఉంది. పని స్వభావంతో పాటు బ్యాంకు అకౌంట్ వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మొబైల్ ఓటీపీని నమోదు చేస్తే ధ్రువీకరణ ప్రక్రియ పూర్తవుతుంది.

### కార్మికులపై కేంద్రం చిన్నచూపు

ఈ- శ్రమ్ పథకాన్ని ప్రారంభించి నాలుగేళ్లయినా ఇప్పటి వరకూ ఒక్క క్లెయిమ్ కూడా పరిష్కారం కాలేదు. అందువల్ల కార్మికులు ఈ- శ్రమ్ కార్డులంటేనే అయిష్టంగా ఉన్నారు. ఈ శ్రమ్ కార్డులు కార్మికులకు ఎలాంటి భరోసా ఇవ్వలేకపోతున్నాయి. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిన్నచూపుకు ఇది నిదర్శనం.

-దండా లక్ష్మీ నారాయణ, సీఐటీయూ

## ప్రశాంతంగా 'పాలిసెట్'

● పరీక్షకు 84శాతం మంది విద్యార్థుల హాజరు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు నగరంలో మొత్తం 11 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కో-ఆర్డినేటర్, ఎంబీ టీఎస్ కళాశాల ప్రిన్సిపల్ శేఖర్‌బాబు తెలిపారు. 4,055 విద్యార్థులకు గాను 3,408 మంది హాజరయ్యారని వెల్లడించారు. పరీక్ష ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు నిర్వహించారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. డిస్‌ప్లే బోర్డుల్లో నంబరు పరిశీలించుకుని కేం ద్రాల్లోకి వెళ్లారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కో-ఆర్డినేటర్ వెల్లడించారు.



పరీక్ష కేంద్రంలోకి పరిగెడుతున్న విద్యార్థులు



పరీక్షలు పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు.

## భోక్తల అక్రమాలపై.. నివేదిక సిద్ధం

- పొన్నూరు పట్టణంలోని ఆలయాల విరాళాల్లో మాయ
- వైసీపీ హాయంలో వంద కిలోల ఇత్తడి మాయం
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల లేఖతో..దేవదాయ అధికారుల విచారణ
- సమగ్ర విచారణ అనంతరం చర్యలు

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన సహస్ర లింగేశ్వర, వీరాంజనేయ స్వామి ఆలయాల్లో గత ఆరేళ్లలో జరిగిన అక్రమాలపై నివేదిక దేవదాయశాఖ ఉన్నతాధికారులకు చేరింది. ఈ పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పేరిట అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆలయంలో ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా పలు చోట్ల ఐరన్ షెడ్లను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. ఈ నిర్మాణాలకు భక్తుల నుంచి కొందరు ఆలయ సిబ్బంది అనధికారికంగా విరాళాలు వసూలు చేయడమే కాకుండా.. ఆ నగదు ఆలయానికి జమ చేయకుండా సొంతానికి వినియోగించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కొందరు సిబ్బంది, ఉద్యోగులు ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామనే పేరుతో భక్తుల నుంచి భారీగా విరాళాలు దండుకున్నారు. ప్రత్యేక పూజల పేరిట వసూళ్లు చేసి.. స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఐదేళ్ల పాటు ఆలయంలో ఎలాంటి లెక్కలు లేకుండా.. ఇష్టారాజ్యంగా నిధులు ఖర్చు చేయడం వంటి ఆరోపణలపై ఇటీవల భక్తులు దేవదాయశాఖ ఉన్నతాధికారులకు నేరుగా ఫిర్యాదులు చేశారు.

### వంద కిలోల ఇత్తడి మాయం..!

శ్రీ వీరాంజనేయస్వామి ఆలంయలో.. దశావతారాల ఉప ఆలయం ఉంది. ఈ ఆలయానికి భక్తులు సమకూర్చిన వంద కిలోల ఇత్తడి రికార్డుల్లో లేకుండా మాయం అయింది. దశావతారాల ఆలయంలో శిథిలమైన ధ్వజ స్తంభాన్ని 2022 వ ఏలో పునఃప్రతిష్ఠించారు. ధ్వజ స్తంభానికి ఓ మహిళా భక్తురాలు ఇత్తడి మానిగలు తొడగడానికి రూ.1.50 లక్షలు విరాళమిచ్చారు. ఈ నగదు విరాళ వివరాలు, శిథిలమైన ధ్వజస్తంబానికి చెందిన వంద కిలోల ఇత్తడి తొడుగులు, బాలవెల్లి అలంకారాలు ఇతర వివరాలు ఏమీ ఆలయ రికార్డుల్లో నమోదు చేయలేదు. వంద కిలోల వరకు పాత ఇత్తడి ఓ వైసీపీ నాయకుడికి అనధికారికంగా అప్పగించినట్లు సమాచారం. మహిళా భక్తురాలు ఇచ్చిన విరాళం కూడా కొందరు ఉద్యోగులు సొంతానికే వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. 2022లో పునఃప్రతిష్ఠించిన ధ్వజనస్తంభం కూడా ఇత్తడి మానికల తొడుగులు లేకపోవడంతో.. కేవలం మూడేళ్లలోనే శిథిలమై.. పూజకు పనికి రాకుండా పోయింది. దీంతో అధికారులు బాల ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు.



శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలోని శిథిలమైన దశావతారాల ధ్వజస్తంభం

### ఫిర్యాదులు బుట్టదాఖలు

విరాళాల సొమ్ము దుర్వినియోగంపై గతంలో భక్తులు అప్పటి వైసీపీ పాలకులకు ఫిర్యాదులు చేశారు. అధికారుల బాధ్యతారాహిత్యంతో.. అవి బుట్ట దాఖలు అయ్యాయి. ఇటీవల కొందరు భక్తులు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ను స్వయంగా కలసి.. ఆలయంలో జరిగిన అక్రమాల విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దేవదాయశాఖ ఉన్నతాధికారులకు అక్రమాల గుట్టు విప్పాలని లేఖ రాశారు. దీంతో ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆలయ రికార్డులను తనిఖీ చేశారు. విరాళాలు అందజేసిన భక్తులను రహస్యంగా విచారించి, వారి నుంచి లిఖిత పూర్వకంగా సమాధానాలు రాబట్టారు. భోక్తలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. ఇత్తడి మానికల కోసం విరాళమిచ్చిన మహిళా భక్తు రాలు కూడా విచారణకు హాజరై లిఖిత పూర్వక సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మరో కొద్ది రోజులలో ఈ అక్రమాలపై సమగ్ర విచారణ, నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని దేవదాయశాఖ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

(5వ పేజీ తరువాయి)

డీఎస్పీలు భద్రత ఏర్పాట్లలో క్షణం తీరికలేకుండా విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రధాని రోడ్ షో, పాల్గొనే సభా వేదిక, శంకుస్థాపన చేసే పైలాన్ ప్రాంతాలను పోలీసు బలగాలు అదుపులోకి తీసుకుని పహారా కాయడమే కాకుండా అనుక్షణం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తి భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ పర్యవేక్షణలోనే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ అడుగుపెట్టే గన్నవరం విమానాశ్రయం నుంచి రాజధాని ప్రాంతంలో పర్యటించే ప్రాంతాలన్నింటిలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా బుధవారం నిర్వహించిన అనధికార ట్రయల్ రన్ ఎటువంటి ఘటనలకు ఆస్కారం లేకుండా సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా గురువారం ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.

### తనిఖీలు... సోదాలు

ప్రధాని పర్యటన దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర హోం శాఖల పరిధిలో అన్ని పోలీసు విభాగాలు రంగం లోకి దిగాయి. ఎస్పీజీ నేతృత్వంలో రాజధాని ప్రాంతాన్ని ఆయా బలగాలు జల్లెడ పడుతున్నాయి. రాజధాని గ్రామా ల్లో అడుగుపెట్టే సాధారణ వ్యక్తులను కూడా వదలకుండా తనిఖీలు చేస్తున్నారు. ప్రధాని సభ జరిగే వెలగపూడి ప్రాంతానికి సుమారు 25 కిలో మీటర్ల పరిధి నుంచే చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక బలగాలను రంగంలోకి దించారు. రాజధాని ప్రాంతానికి వచ్చే అన్ని రోడ్లలో పోలీసులు మోహరించాయి.

### ఏర్పాట్లు పరిశీలించిన నారాయణ

వెలగపూడి సచివాయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రధాని బహిరంగ సభ, వేదిక వద్ద ఏర్పాట్లను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం వేర్వేరుగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారులతో వారు మాట్లాడారు. వేదిక వెనుక అమరావతి పనులకు శంకుస్థాపన స్థూపం(పైలాన్) పనులను మంత్రి పరిశీలించారు. ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ప్రధాని సభ కార్యక్రమ నోడల్ అధికారి వీరపాండ్యన్ ఉన్నారు.

### డ్రోన్‌లు, బెలూన్‌లు ఎగురవేయడం నిషేధం

ప్రధానమంత్రి మోదీ రాజధాని పర్యటన దృష్ట్యా వెలగపూడి సచివాలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో అనధికార డ్రోన్లు, బెలూన్లు ఎగురవేయడం నిషేధమని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. మే 2న తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెలగపూడి సచివాలయం సమీపంలో నిర్వహించనున్న రాజధాని పునఃప్రారంభ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రానున్న నేపథ్యంలో సచివాలయం, పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా ఎటువంటి డ్రోన్లు, నలుపు రంగు బెలూన్స్, ఇతర రకాలైన బెలూన్స్ ఎగురవేయడం నిషిద్ధమన్నారు. ఈ పర్యటన నేపథ్యంలో హెలికాప్టర్ రాకపోకలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో అనధికార డ్రోన్లు మరియు బెలూన్లు ఎగురవేయడం వలన ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు. వాటిని ఎగురవేయ రాదని ప్రజలకు సూచిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎవరైనా పోలీసుల హెచ్చరికలు అతిక్రమిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అమరావతి.. అష్టదిగ్బంధనం



తుళ్లూరులో ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న రైతులు



ప్రధాని మంత్రి ఆవిష్కరించే పైలానును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ



సీడ్ రోడ్డు మీద వాహనాల డైవర్షన్ కోసం ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టు



ప్రధాని వచ్చే మార్గంలో జాగిలాలతో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

## అవీ.. ఇవీ..

### విజయవంతంగా ముగిసిన నాటికలు



స్వేచ్ఛ నాటికలోని ఓ సన్నివేశం

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఐదు రోజులుగా పట్టణం లోని కేజీఎం హైస్కూ ల్లో నిర్వహిస్తున్న కళాంజలి సాంస్కృతిక నాటికలు బుధవారంతో విజయ వంతంగా ముగిశాయి. చివరి రోజు బీరం వెంకట సుబ్బయ్య, పున్నమ్మ కళా వేదిక ఆధ్వర్యంలో స్వేచ్ఛ, మా ఇంట్లో మహా భారతం, నిర్వహించగా ప్రేక్షకులు విశేషంగా హాజరై ఆనందించారు. అంతకుముందు విశ్రాంత డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, గీతారాణి దంపతులు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. నాటికలు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయని, అలాగే సంస్కృతి సాంప్రదాయాల విలువలు పెంచుతాయని నిర్వాహకులు వివరించారు.

### సుగుణరావు చెప్పినవన్నీ అసత్యాలే

● ఖండించిన సీఐ శేషగిరిరావు

మార్టూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అట్లూరి సుగుణరావు అసత్య ప్రచారంతో వీడియోని రిలీజ్ చేశారని, వాస్తవాలను తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేశారని, సీఐ యం శేషగిరిరావు అన్నారు. బుధవారం సీఐ ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 28న సాయంత్రం మార్టూరులో స్థానికంగా అంబేద్కర్‌నగర్ లో దుడ్డు హరిబాబు, అదేవిధంగా అట్లూరి సుగుణరావు కుటుంబాల మధ్య బోరునీళ్ల పట్టుకునే విషయంపై కొట్లాట జరిగిందన్నారు. అందుకు సంబంధించి రెండు కుటుంబాలకు చెందిన వారి ఫిర్యాదుల మేరకు రెండు పరస్పర కేసులను నమోదు చేశామన్నారు. కాని తన కేసును పోలీసులు నమోదు చేయలేదంటూ సుగుణరావు చేతికి కత్తితో గాయం చేసుకొని, ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు సోషల్ మీడియాలో వీడియో రిలీజ్ చేయడాన్ని సీఐ తీవ్రంగా ఖండించారు. చట్టపరంగా, చట్టపరిధిలో తాము అందరినీ సమానంగా చూస్తామన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు చట్టపరంగానే పనిచేస్తామన్నారు.

### ఈసారి కందిపప్పు లేవు

ఐదు నెలల నుంచి నిలిచిన సరఫరా

నేటి నుంచి రేషన్ సరుకుల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల్లో ఈసారి కందిపప్పు పంపిణీ లేనట్లే. ప్రభుత్వం సరఫరా చేయకపోవడమే ఇందుకు కారణం. జిల్లాలో గురువారం నుంచి రేషన్ పంపిణీ జరగనుంది. ఈ రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉండగా మొబైల్ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 6.61 లక్షల రేషన్ కార్డులు ఉండగా అవసరమైన మేరకు బియ్యం, చక్కెరను దుకాణాలకు సరఫరా చేశారు. గత ఐదు నెలల నుంచి జిల్లాకు కందిపప్పు సరఫరా కావడం లేదు. దీంతో రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం, చక్కెరకే పరిమితమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు కందిపప్పు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. అయితే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక బియ్యం, పంచదార, కందిపప్పుతో పాటు చిరు ధాన్యాలను కూడా సరఫరా చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో కందిపప్పుతో పాటు జొన్నలు కూడా ఇచ్చారు. దీంతో కార్డుదారులు ఇక నుంచి తమకు అన్నిరకాల వస్తువులు తక్కువ ధరకు దొరకుతాయని భావించారు. నవంబరులో 70శాతం కందిపప్పును జిల్లాకు కేటాయించగా, డిసెంబరులో అసలు జిల్లాకు కేటాయించ లేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. తాజాగా మే 1వ తేదీ నుంచి జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభమవుతుండగా ప్రభుత్వం జిల్లాకు కేవలం బియ్యం, చక్కెరను మాత్రమే సరఫరా చేసింది.

### కొలిక్కిరాని కసరత్తు

టీచర్ల పునర్విభజనపై కుస్తీ.. రకరకాల సవరణలతో తలనొప్పి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయుల పునర్విభజన ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. జిల్లాలోని 3,048 పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికాగా టీచర్ల కేటాయింపు విషయంలో ఇంకా కుస్తీ పడుతున్నారు. టీచర్ల పునర్విభజనకు సంబంధించి విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు రాతపూర్వకంగా జారీ చేయకుండా రోజు వెబెక్స్ సమావేశంలో రకరకాల సవరణలు చెప్తుండటంతో క్షేత్రస్థాయిలో అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రోజూ ఒంగోలు నుంచి కమిషనర్ కార్యాలయానికి క్యూ కడుతున్నా ఆశించిన మేర పురోగతి లేదు. బుధవారం కమిషనర్ కార్యాలయానికి వెళ్లిన డీఈవో కిరణ్‌కుమార్ ఇతర సిబ్బంది టీచర్ల పునర్విభజనను మమఅనిపించి నివేదించారు. అయితే టీచర్ల కేటాయింపుల్లోని తప్పులను కమిషనర్ కార్యాలయ సిబ్బంది ఎత్తిచూపి డీఈవో సమర్పించిన ప్రతిపాదనలను వెనక్కు పంపారు. తప్పులతడకలుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండటం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బుధవారం ఎంత రాత్రైనా జాబితాల్లోని తప్పులు సవరించి కచ్చితమైన జాబితాలను సంతకాలతో సమర్పించిన తర్వాతే వెళ్లాలని కమిషనర్ కార్యాలయం హుకుం జారీ చేసింది. దీంతో ఇక్కడి నుంచి వెళ్లిన అధికారులు, సిబ్బంది తప్పులను సవరించడంలో తలమునకలవుతున్నారు.

### కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెబాట

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన



నిరసన తెలుపుతున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెను ప్రారంభించారు. జిల్లాలోని 538 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఈ సమ్మెలో పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ నుంచి పీహెచ్‌డీ వరకు ఉన్నత విద్య చదివినప్పటికీ వారు చేస్తున్న ఉద్యోగానికి భద్రత లేదన్నారు. ఒక నిర్దిష్టమైన పనిలేకుండా రకరకాలుగా పనులు చేయిస్తూ పనిభారం పెంచడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగులకు వెంటనే పనిభారం తగ్గించాలని డిమాండ్‌చేశారు. కేంద్రం ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యూలర్ చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్‌ఎంహెచ్ ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇచ్చివేతనాలు చెల్లించాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఓపీ దగ్గర నుంచి రోగులకు బీపీ, షుగర్, చిన్న పిలలలకు క్యాన్సర్ పరీక్షలతో పాటు అనేక రకాల వైద్యుల సలహాలు, సౌకర్యాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారనితెలిపారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కోశాధికారి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం రాజేష్, ఎ. నిర్మల, జీవనజ్యోతి, ప్రసన్న, సయ్యద్ గౌస్ తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి

● సబ్‌స్టేషన్‌కు భూమి పూజ కార్యక్రమంలో మంత్రి రవికుమార్ ● వ్యవసాయానికి, గృహ వినియోగానికి వేర్వేరుగా లైన్ల ఏర్పాట్లు

అద్దంకి, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరా కూటమి ప్రభుత్వ ధ్యేయం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలో ఎన్‌ఎస్‌పీ కాలనీలో రూ.6.73 కోట్లతో సెమీఇండోర్ సబ్‌స్టేషన్, ద్వారకానగర్‌లో రూ.4.50కోట్లతో అవుట్‌డోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, శింగరకొండ రోడ్డులో రూ.2.25 కోట్లతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. అద్దంకి పట్టణ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.1.50 లక్షల విలువైన డ్రోన్ కెమెరాను మంత్రి రవికుమార్ ద్వారా సీఐ సుబ్బరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో ఏ చిన్న ఘటన చోటుచేసుకున్నా, గుర్తించే విధంగా నాణ్యమైన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. దొంగతనాలు జరగకుండా నిఘా పెంచడంతో పాటు పాత దొంగతనాలలో సొత్తు రికవరీపై కూడా దృష్టి పెట్టాలన్నారు. పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ప్రత్యేకంగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అద్దంకి పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగ్గట్లు అదనంగా రెండు సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 4 నెలలలో సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అద్దంకి పట్టణంలో ఇప్పటికే అత్యధిక శాతం పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఏల్చూరులో 132 కేవీ సబ్‌స్టేషన్, కొప్పరం, మల్లాయపాలెంలలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయన్నారు. డిమాండ్ ఉన్న అన్ని ప్రాంతాలలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు.

**పీఎం మోదీ సభకు తరలిరావాలి**



పోలీసులకు డ్రోన్ కెమెరాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అమరావతి పునర్నిర్మాణం కోసం మే 2న జరిగే ప్రదానమంత్రి మోదీ సభకు అద్దంకి నియోజకవర్గం నుండి పెద్దఎత్తున కూటమి నేతలు, కార్యకర్తలు తరలి రావాలని మంత్రి రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అద్దంకిలో అద్దంకి నియోజకవర్గ నాయకు లు, కార్యకర్తలతో మంత్రి రవికుమార్, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావులు సమావేశం నిర్వహించారు. మోదీ సభకు వచ్చేందుకు నియోజకవర్గానికి 70 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. అధికారులు, నాయకులు సమన్వయం తో పనిచేసి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

**ప్రజల నుండి అర్జీలు స్వీకరణ..**



భూమిపూజ చేస్తున్న మంత్రి రవికుమార్

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా బుధవారం మంత్రి రవికుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోయిన రైతులకు ఇంకా పరిహారం చెల్లించలేదని రావూరి రంగయ్య మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అద్దంకి, పంగులూరు మండలాల పరిధిలో ఇంకా పరిహారం అందని 100 మంది రైతులకు వెంటనే పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నాగులపాడు రోడ్డు వద్ద 16 అడుగుల ఎత్తులో అండర్‌పాస్ నిర్మాణం చేయడం వల్ల ఇబ్బందులు వస్తాయని, 22 అడుగుల ఎత్తుకు పెంచాలని శ్రీనివాసరావు కోరారు. ఆర్‌వో ప్లాంట్ లు, అంతర్గత సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ లు, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను రవికుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు, విద్యుత్ ఎస్‌ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, అద్దంకి అగ్నిమాపక అధికారి వెంకట్రావు, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ డీఈ దామోదరం, ఏఈలు ఎస్.శ్రీనివాసరావు, శివప్రసాద్, బాలకోటేశ్వరరావు, మైలా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కొమ్మాలపాటి సుధీర్, అత్తులూరి రమేష్, యేజెండ్ల నాగరాజు, కంపా రజనీ, తిరుపతమ్మ, సుభాషిణి, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కాకాని అశోక్, కుందారపు రామారావు, మానం మురళీమోహన్‌దాస్, కోనేటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## చీరాల మునిసిపల్ ఛైర్మన్ అవిశ్వాసంలో మరో ట్విస్ట్

జంజనం శ్రీనివాస్ చేరికతో మారుతున్న సమీకరణలు

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ ఛైర్మన్ అవిశ్వాసం అంశంలో బుధవారం మరో ట్విస్ట్ చోటుచేసుకొంది. అమరావతి సచివాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు టీడీపీ పార్టీలో చేరారు. జంజనంకు నేతలు పార్టీ కండువాతో స్వాగతించారు. గత బుధవారం టీడీపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళీని కలిసి జంజనంపై అవిశ్వాసంకు తీర్మానం చేశారు. ఈ నేపద్యంలో అధికారులు మే 14న బలపరీక్షకు నోటీసులు కూడా అందజేశారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు సైతం అవిశ్వాసం అవసరం లేదంటూ మరో అర్జీను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో గజవల్లిపై నియోజకవర్గ క్యాంపు కార్యాలయం సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రోజుకో మలుపు తిరుగుతున్న మునిసిపల్ అంశం బుధవారంతో కొత్త దారులు పట్టింది. అయితే బల నిరూపణ అనివార్యం కానుండగా, ఆ రోజు ఛైర్మన్‌ను ఎమ్మెల్యే కొండయ్య వర్గం అంగీకరిస్తే అనుకూలంగా స్పందించాల్సి ఉంటుంది. లేదా ఆ రోజు పరీక్షకు గైర్హాజరు కావాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే పూర్తిగా ఆమంచి ఆలోచనను తిప్పి కొట్టేందుకే మాజీ ఎమ్మెల్యే బలరాం వ్యూహంతోనే జంజనం టీడీపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ అవకాశాన్ని జంజనం కూడా సద్వినియోగం చేసుకున్నట్లు అంచనా. ఏది ఏమయినా కొండయ్య కూడా మొట్టమొదటి నుండి జంజనంపై సానకూలంగానే ఉండటంతో పాటు, ఆయన రాజకీయ ప్రస్థానం కూడా టీడీపీతోనే కావడంతో అందరూ దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా చోటుచేసుకొన్న పరిణామాలతో ఇక ఇప్పటికే పాపికొండల పర్యటనలో కౌన్సిలర్లు నేడు చీరాలకు చేరనున్నట్లు సమాచారం.

## ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ జట్టు ఎంపిక

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : చిన్నగంజాంలోని మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ జట్టును బుధవారం ఎంపిక చేసినట్లు కోచ్ ఎం.గిరిబాబు తెలిపారు. ఈ నెల 20వ తేదిన జిల్లా బీచ్ కబడ్డీ జట్టుకు 15 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి కళాశాల ఆవరణలో ఈ నెల 21వ తేది నుండి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ప్రతిభ చూపిన ఆరుగురు క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మే నెల 2, 3, 4 తేదీలలో కాకినాడలో జరిగే 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలలో ఎంపికైన ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ జట్టు పాల్గొన్నట్లు తెలిపారు. జట్టు సభ్యులకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు క్రీడా దుస్తులను అందజేసినట్లు తెలిపారు. బీచ్ కబడ్డీ పోటీలలో జిల్లా జట్టు ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తేవాలని ఎస్.ఐ శీలం రమేష్ అన్నారు. ఎంపికైన కీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కబడ్డీ క్రీడాకారులు, హెడ్ కానిస్టేబుల్ పి.రామలింగేశ్వరారవులు పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా బీచ్ కబడ్డీ జట్టు 1.) ఎన్.ఉమామహేశ్వరావు( కెప్టెన్, సోపిరాల), బి.సురేష్‌రెడ్డి (మూలగానివారిపాలెం), వై.రాజశేఖర్‌రెడ్డి(జాంగ్రపేట), పి.బ్రహ్మారెడ్డి, జి.లక్ష్మారెడ్డి, ప్రసాద్‌రెడ్డి(రాజుబంగారుపాలెం), కోచ్ ఎం.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.




ఎంపికైన ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు

# బతిమలాడి..అజెండాకు ఆమోదం

సాదాసీదాగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

మార్కాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలాఖరులో మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, సమస్యలను తెలియజేసేందుకు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం పరిపాటి. అక్కడ ముందుగా అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన అజెండాపై, ప్రజల సమస్యలపై చర్చించి కౌన్సిల్‌లో ఆమోదంతో పనులు చేపడతారు. కానీ బుధవారం మున్సిపాలిటీలో జరిగిన సాధారణ సమావేశానికి కౌన్సిలర్లు ముఖం చాటేశారు. సాయంత్రం 4.00 గంటలకు సమావేశం ప్రారంభంకావాల్సివున్నా పట్టుమని పది మంది కూడా హాజరుకాలేదు. దీంతో ఛైర్మన్ చిర్లంచర్ల కృష్ణ పలువురు కౌన్సిలర్లకు ఫోన్ చేసి బతిమలాడి సమావేశానికి పిలిచించుకున్నారు. కోరం సరిపోయేంతమంది కౌన్సిలర్లు 14 మంది 5.00 గంటలకు చేరుకున్నాక 23 అభివృద్ధి అంశాలతో కూడిన అజెండాను ఆమోదింపజేసుకుని మమ అనిపించారు.

**ముఖం చాటేసిన కౌన్సిలర్లు**

మార్కాపురం మున్సిపాలిటీలో మొ త్తం 35 మంది కౌన్సిలర్లకుగాను ఒక రు చనిపోగా, 34 మంది ఉన్నారు. అధికార, ప్రతిపక్షానికి ప్రస్తుతం సమానంగా కౌన్సిలర్లు ఉన్నారు. ప్రతిపక్షానికి చెందిన వాళ్లు సమావేశానికి గైర్హాజరైనా అధికార పక్షానికి చెందిన 17 మంది హాజరైనా కోరం సరిపోతుంది. కానీ ఛైర్మన్ కృష్ణ పట్ల అధికార పక్షాని కి చెందిన కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేదనేది వారి వాదన. అంతేకా క వైసీపీ తరపున గెలిచి టీడీపీలో చేరి న కౌన్సిలర్లు కూడా బుధవారం సమావేశానికి హాజరుకాలేదు. కొందరు కౌన్సిలర్లు వారి సమస్యలను తెలియజేసేందుకు మాత్రమే వచ్చారు. చివరికి గత్యంతరం లేని పరిస్థితుల్లో ఛైర్మన్ పలువురు కౌన్సిలర్లకు ఫోన్ చేసి రావాలని కోరారు. గంట ఆలస్యం తర్వాత కోరంకు సరిపోయేంత మంది హాజరరుకావడంతో అజెండాను ఆమోదించుకున్నారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ బాలమురళీకృష్ణ

**అక్రమ లే-అవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు**

పట్టణంలో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఛైర్మన్ చిర్లంచర్ల కృష్ణ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే అక్రమ లేఅవుట్లను గుర్తించి ఓ పత్రికలో వాటి వివరాలను ప్రచురించినా వాటికి సంబంధించి క్రయవిక్రయాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోనప్పుడు పత్రికల్లో ప్రచురించడం ఎందుకని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణానికి సాగర్ నీటిని అందించే పైప్‌లైన్ పనులు దూపాడు సమీపంలో సంవత్సర కాలంగా నిలిచిపోయాయని వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్ట్ సంస్థ పట్టించుకోకుంటే పనులు క్యాన్సిల్ చేయడమో, వారికి నోటీసులు ఇవ్వడమో త్వరగా చేయాలన్నారు. గత సంవత్సరం పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతోనే ఈ సంవత్సరం రవాణా చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. 22, 29వ వార్డుల కౌన్సిలర్లు పలు సమస్యలపై వినతిపత్రం అందజేయడంతో వాటిని టేబుల్ అజెండాలో చేర్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, డీఈ లక్ష్మీనారాయణ, మేనేజర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి పర్యటనతో ట్రాఫిక్ మళ్లింపు

● రేపు ఉదయం 5 నుంచి రాత్రి 10 వరకు ఆంక్షలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతిలో పర్యటన కారణంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లించాలని రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు చెన్నయ్ నుంచి విజయవాడ మీదగా విశాఖపట్నం వెళ్లే వాహనాలను ఒంగోలులోని త్రోవగుంట వద్ద నుంచి చీరాల వైపు మళ్లిస్తారు. అదేవిధంగా విశాఖపట్నం నుంచి చెన్నయ్ వైపు వెళ్లే వాహనాలు కూడా అదే మార్గంగా తరలిచాలని ఆదేశాలు అందాయి. మల్టీ-యాక్సిల్ గూడ్స్ వాహనాలు చెన్నయ్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు ఒంగోలు, చిలకలూరిపేట వద్ద నిలిపివేస్తారు. ఆయా వాహనాలు శుక్రవారం రాత్రి 9 గంటల తరువాత ముందుకు వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. ట్రాఫిక్ మళ్లింపు ఈనెల 2న ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అమలు చేస్తారని డీజీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన బుధవారం విడుదల చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రయాణికులు, వాహన డ్రైవర్లు సహకరించాలని కోరారు.

## కారు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంలో జరిగిన కారు ప్రమాదంలో ఒంగోలుకు చెందిన గుర్రం యగ్నేష్(20) మృతిచెందడంలో వారి కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. స్థానిక రామనగర్ 3వ లైను 6వ క్రాస్ రోడ్‌లో నివాసం ఉండే గుర్రం గురువీర్ జిల్లాలోని తూర్పుగంగవరం, అనంతపురంలో పాల వ్యాపారం చేస్తుండగా, తల్లి గృహిణిగా ఉన్నారు. యగ్నేష్ నెల్లూరులోని నారాయణ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా తనతోపాటు చదువుకునే స్నేహితుడు చక్రధర్ సోదరి నిశ్చయ కార్యక్రమానికి హాజరై వస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో యగ్నేష్ మృతిచెందాడు.

### అమరావతి.. అష్టదిగ్బంధనం

(5వ పేజీ తరువాయి)

డీఎస్పీలు భద్రత ఏర్పాట్లలో క్షణం తీరికలేకుండా విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రధాని రోడ్ షో, పాల్గొనే సభా వేదిక, శంకుస్థాపన చేసే పైలాన్ ప్రాంతాలను పోలీసు బలగాలు అదుపులోకి తీసుకుని పహారా కాయడమే కాకుండా అనుక్షణం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తి భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ పర్యవేక్షణలోనే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ అడుగుపెట్టే గన్నవరం విమానాశ్రయం నుంచి రాజధాని ప్రాంతంలో పర్యటించే ప్రాంతాలన్నింటిలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా బుధవారం నిర్వహించిన అనధికార ట్రయల్ రన్ ఎటువంటి ఘటనలకు ఆస్కారం లేకుండా సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా గురువారం ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.

**తనిఖీలు... సోదాలు**

ప్రధాని పర్యటన దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర హోం శాఖల పరిధిలో అన్ని పోలీసు విభాగాలు రంగంలోకి దిగాయి. ఎస్‌పీజీ నేతృత్వంలో రాజధాని ప్రాంతాన్ని ఆయా బలగాలు జల్లెడ పడుతున్నాయి. రాజధాని గ్రామాల్లో అడుగుపెట్టే సాధారణ వ్యక్తులను కూడా వదలకుండా తనిఖీలు చేస్తున్నారు. ప్రధాని సభ జరిగే వెలగపూడి ప్రాంతానికి సుమారు 25 కిలో మీటర్ల పరిధి నుంచే చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక బలగాలను రంగంలోకి దించారు. రాజధాని ప్రాంతానికి వచ్చే అన్ని రోడ్లలో పోలీసులు మోహరించాయి.

**ఏర్పాట్లు పరిశీలించిన నారాయణ**

వెలగపూడి సచివాయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రధాని బహిరంగ సభ, వేదిక వద్ద ఏర్పాట్లను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం వేర్వేరుగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారులతో వారు మాట్లాడారు. వేదిక వెనుక అమరావతి పనులకు శంకుస్థాపన స్థూపం(పైలాన్) పనులను మంత్రి పరిశీలించారు. ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ప్రధాని సభ కార్యక్రమ నోడల్ అధికారి వీరపాండ్యన్ ఉన్నారు.

# అమ్మా.. నిద్రలేమా..!

● తల్లి మృతదేహం వద్ద చిన్నారుల ఆర్తత పిలుపు

● రెండేళ్ల క్రితం తండ్రి మృతి



తల్లిమృతదేహం ముందు విషన్నవదనంతో నిలుచున్న చిన్నారులు

మర్రిపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వారు ముగ్గురూ చిన్నారులు. ఒక తల్లి బిడ్డలు. మంచంపై విగతజీవిగా ఉన్న తల్లి చనిపోయిందని కూడా ఆ పసి మనసులకు తెలీదు. తల్లి భుజాన్ని తడుతూ 'అమ్మా.. నిద్రలేమ్మా.. ఆకలవుతోంది' అని పదేపదే పిలుస్తూ ఉన్న ఆ చిన్నారులను చూసి అక్కడున్న వారంతా చలించిపోయారు. కన్నీటి చుక్కను చిందించారు. మండల కేంద్రమైన మర్రిపూడిలో బుధవారం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కాలనీకి చెందిన కోండ్రు షడ్రక్, మౌనిక(29)లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అరవింద్, మేషక్, రూపిక.. ముగ్గురూ చిన్నారులే. వీరిది నిరుపేద కుటుంబం. ఏరోజుకారోజు కూలి చేసుకుని జీవనం గడపాలి. 2023 ఏప్రిల్‌లో కోండ్రు షడ్రక్ తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. కూలి చేసుకుంటూ మౌనిక తన పిల్లలను పోషించుకుంటోంది. ఆమె కూడా అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆమె శాశ్వతనిద్రలోకి వెళ్లినట్లు తెలీని ఆ పసిబిడ్డలు తల్లి దగ్గరకెళ్లి లేపే ప్రయత్నం చేయడం చూపరులకు కంటతడి పెట్టించింది. అనాథలైన ఆ అమాయకపు పిల్లలు ఎలా బతకాలో అని సమీప బంధువు గజ్జా దానమ్మ రోదించింది. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురజాల పోలయ్య, తెలుగు యువత నాయకులు రాజు, సురేష్, ప్రసాదు మాదిగ, జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షుడు బాబురావు.... మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మౌనిక కుటుంబాన్ని ఆదుకునేందుకు మంత్రి స్వామి, మారిటైంబోర్డ్ ఛైర్మన్ సత్యల కలిసి ప్రభుత్వం, పార్టీ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

### ఈకేవైసీకి గడువు మరో 2 నెలలు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించుకునేందుకు మరో రెండు నెలలు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్‌కార్డుల పరిధిలో ఉన్న లబ్ధిదారులందరూ ఈకేవైసీని చేయించుకునేందుకు మార్చి 15 నుంచి అవకాశం కల్పించింది.మార్చి ఆఖరుకు ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించారు. ప్రస్తుతం జిల్లాలో ఇంకా 1.22 లక్షల మంది లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జూన్ 30 వరకు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులందరూ చేయించుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30లోపు ఈకేవైసీ చేయించుకోకపోతే ఇక గడువు పెంచేది లేదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్లు సమాచారం.

## అవీ..ఇవీ..

### కేజీబీవీలో నూతన వసతిగృహానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షులు వీరయ్య

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ ప్రాంగణంలో రూ.1.55 కోట్లతో నూతనంగా నిర్మించే హాస్టల్ భవనానికి బుధవారం టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య భూమి పూజ నిర్వహించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికల వసతి నిమిత్తం నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు బాపట్ల సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీ.నాగజ్యోతి తెలిపారు. సమగ్ర శిక్ష నిధులు రూ.1.55 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్‌లో మూడు గదులు, మరుగుదొడ్లు, మొదటి అంతస్తులో మూడు గదులు, మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. నూతన వసతిగృహాన్ని నాణ్యత ప్రమాణాలతో తొమ్మిది నెలల లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, సమగ్రశిక్ష ఏ.ఈ. వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ సుబ్బారావులు పాల్గొన్నారు.

### 9న మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి,(మార్టూరు)ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9 న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరుకావాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

### వృద్ధులకు పాదరక్షలు పంపిణీ

మార్టూరు,ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని అమ్మ ఆశ్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు కుక్కపల్లి మాదవిలత తన భర్త కుక్కపల్లి గోపి 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం వృద్ధులకు,పేదలకు అన్నదానం చేసి పండ్లు,పాదరక్షలను పంపిణీచేశారు. కార్యక్రమంలో జాష్టి అనూరాధ, నిర్మలాదేవి, అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

### గొడుగులు, చెప్పులు పంపిణీ




గొడుగులు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

పర్చూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు బొమ్మల కూడలిలో రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ సారధ్యంలో దాతల సహకారంతో చిరువ్యాపారులకు, ప్రయాణికులకు చెప్పులు గొడుగులు పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలకు దాతలు అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదన్నారు. పలువురు రోటరీ ప్రతినిధులు కొనియాడారు. కార్యక్రమంలో గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కసా అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ




ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న టీడీపీ శ్రేణులు

పోతినవారిపాలెం(పర్చూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలోని పోతినవారిపాలెంలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహ నిర్మాణానికి బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సీనియర్ పార్టీ నేతలు మాట్లాడుతూ తెలుగుజాతి గొప్పతనాన్ని దేశవ్యాప్తంగా చాటిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండలపార్టీ అధ్యక్షులు తిరుములశెట్టి శ్రీహరి, సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్.ఖాశీం, కొల్లా నాగబాబు, గోరంట్ల రమాదేవి, కొసరాజు సురేంద్ర, పోతిన మస్తాన్‌రావు, నార్నె మధు, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

### పలువురికి మంత్రి పరామర్శ

అద్దంకి, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని పలు కుటుంబాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం పరామర్శించారు. 9వ వార్డులోని ఘట్టమనేని కోటయ్య ఇటీవల మృతి చెందగా, దశదినకర్మ కు రవికుమార్ హాజరయ్యారు. ఆర్‌ఎంపీ వైద్యులు చెన్నుపల్లి శ్రీనివాసరావు ఇటీవల గుండెసమస్యతో మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన కంచర్ల వాసు కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. స్థానిక టీడీపీ నేతలు ఉన్నారు.

### మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్‌హాల్‌లో మొక్కుబడిగా నిర్వహించారు. ముందుగా జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో యాత్రికుల మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం అజెండాలోని 26 అంశాలను చదవగా ఆమోదించినట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. టీడీపీ, వైసీపీ కౌన్సెలర్లు కూడా మొక్కుబడిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర మంత్రి రవికుమార్ పర్యటనలో ఉండగా మేనేజర్ శ్రీదేవి, ఏఈ లోకేష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఎండమావిగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

- అగ్నిప్రమాదం జరిగితే సర్వం కోల్పోవాల్సిందే
- వేసవి వస్తే భయం గుప్పెట్లో ప్రజలు

పర్చూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం వస్తుందంటే పర్చూరు నియోజకవర్గ ప్రజలను అగ్నిప్రమాదాలు కలవర పెడుతున్నాయి. పాలకులు మారుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపకకేంద్రం ఏర్పాటు కలగానే మిగిలింది. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు చీరాల, బాపట్ల, చిలకలూరిపేటల నుంచి అగ్నిమాపక శకటాలు వస్తేనే మంటలను ఆర్పే పరిస్థితి ఉంది. అగ్ని ప్రమాదం సంభవించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి వారు ఘటనా స్థలానికి చేరుకునే సరికి మంటలు పూర్తిగా వ్యాపించి, నష్టజరగడం సర్వసాధారణంగా మారింది. నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మూడు దశాబ్ధాలుగా ప్రజలు కోరుతున్నా, నేటికీ ఫలితం లేకుండా పోయింది. స్థానికంగా అగ్నిమాపక కేంద్రం అందుబాటులో ఉంటే ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలోనే ఘటన స్థలానికి చేరుకునే అవకాశం ఉంది. తద్వారా ప్రమాద స్థాయిని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. పర్చూరు నియోజకవర్గంలో ఎక్కువమంది వ్యవసాయంపై ఆదారపడి జీవనం సాగిస్తారు. అగ్నిప్రమాదాలు సంభవించి మొక్కజొన్న, పత్తి, గడ్డి, వైట్‌బర్లీ పొగాకు వంటి పంటలు పూర్తిగా దగ్ధమై రైతులను తీవ్రంగా నష్టపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా పలుచోట్ల ఇళ్ల అగ్నిప్రమాదంలో కాలిపోయి బాధితులు సర్వంకోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన ఘటనలు కూడా ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పర్చూరు నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల ఆస్తులు అగ్నికి ఆహుతి కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఇటీవల పర్చూరులోని రామాలయం వీధిలో విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. దీంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకునే సమయానికే ఇళ్ల పూర్తిగా కాలిపోయి మహిళలు మృతి చెందారు.

● కారంచేడు మండలం ఆదిపూడి గ్రామంలో ఫిబ్రవరి 12న అగ్ని ప్రమాదం జరిగి పూరిల్లు దగ్ధమైన సంఘటలో ఇంటిలో ఉన్న బంగారు అభరణాలతో పాటు, రూ.50వేల నగదు కూడా పూర్తిగా దగ్ధమై బాదితులు కట్టుబట్టలతో నిరాశరులయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి ఘటనా స్థలానికి చేరుకునే లోపే ఇళ్లు పూర్తిగా మంటలో కాలిబూడిదైంది.

● జరుబులవారిపాలెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం చోటుచేసుకుని ఇల్లుపూర్తిగా మంటల్లో కాలి పోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా సకాలంలో స్పందించకపోవటంతో బాదితులు పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది. ఇలాంటి సంఘటనలు పర్చూరు నియోజకవర్గంలో అనేకం చోటుచేసు కుంటున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు అందుబాటులో ఉండే విధంగా నియోజవకర్గ కేంద్రమైన పర్చూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆదిపూడిలో కాలిపోతున్న పూరిల్లు (ఫైల్)

## మంచినీటి పైపులకు మరమ్మతులు



వంతెన కింద మంచినీటి పైపులు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

మార్టూరు, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): దాదాపుగా 20 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీలో మంచినీటి పైపులైన్లను వేయడంతో చాలా చోట్ల పైపులు తుప్పుపట్టి శిథిలమయ్యాయి. దీంతో మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా మండల కాంప్లెక్స్ వద్ద ఎదురుగా జాతీయరహదారిపై ఉన్న వంతెన కింద మంచినీటి పైపులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మంచినీటి చెరువు నుంచి గ్రామంలోకి తాగునీటిని పంపిణీ చేసేందుకు ఫిల్టర్ బెడ్ల నుంచి మండల కాంప్లెక్స్ వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ కు నీటిని ఎక్కించేందుకు పైపులైన్ వేశారు. అయితే ప్రస్తుతం ఈ పైపులైన్ పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో పలుమార్లు మరమ్మతులు చేసినప్పటికీ, తరచుగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఫిల్టర్‌బెడ్ల నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కించడానికి చాలా ఎక్కువ సమయం పడుతున్నది. దీంతో గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిదులను వినియోగించి, పాతపైపులను తొలగించి కొత్తగా పైపులైను వేస్తున్నారు. దాదాపుగా 600 అడుగులు దూరం సుమారు 8 లక్షల వ్యయంతో కొత్తగా పైపులైను వేస్తున్నారు. తద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకుకు త్వరితంగా నీటిని సరఫరా చేస్తే అక్కడనుండి గ్రామంలోకి తాగునీటిని సరఫరా చేయడం సులభతరమవుతుంది. గ్రామంలో చాలాచోట్ల మంచినీటి పైపులు మరమ్మత్తులకు గురవుతున్నప్పటికీ, ప్రస్తుతం వంతెన కింద పాతపైపులను తొలగించి కొత్తగా పైపులు వేస్తున్నట్లు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు తెలిపారు.

## డ్రైవర్ నిద్రమత్తుతో లారీ బోల్తా

**తప్పిన ప్రమాదం**

కావూరివారిపాలెం(చీరాల), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తులో డ్రైవర్ వాహనాన్ని నడపడంతో బోల్తా పడింది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కావూరివారిపాలెంలోని ఓ కంపెనీ నుంచి మంగళవారం రాత్రి వాడరేవులో ఐస్‌ను తెచ్చేందుకు వెళుతున్న ఖాళీ లారీ మార్గ మధ్యలోని సిమెంట్ కాలువ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. అయితే ఆ సమయంలో అదృష్ట వశాత్తు ఎటువంటి వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే డ్రైవర్‌కు కూడా ఎటువంటి ప్రమాదం జరుగలేదు. అయితే సుమారు రెండు గంటల పాటు శ్రమించి వాహనాన్ని అదుపులోకి తెచ్చారు. గతంలో ఇదే ప్రాంతంలో ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.



బోల్తాపడిన లారీ

# రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

అద్దంకి,ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలో రెండు రోడ్ల నిర్మాణం కోసం రూ.9.85 కోట్లు మంజూరైనట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలం శాంతినగర్ నుండి వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం మీదుగా ఏలేశ్వరవారిపాలెం వరకు 9.34 కి.మీ తారు రోడ్డు పునర్నిర్మాణానికి రూ.5.10 కోట్లు, బల్లికురవ మండలం కొప్పెరపాడు నుండి కొత్తూరు, వెలమవారిపాలెం మీదుగా జమ్మలమడక వరకు 9.83 కి.మీ తారు రోడ్డు పునర్నిర్మానానికి రూ.4.75 కోట్ల రూపాయలు పంచాయతీరాజ్‌శాఖ నుండి నిధులు విడుదల చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం గొట్టిపాటి రవికుమార్ మార్టూరు ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినప్పుడు ఈ రెండు రోడ్లను నిర్మించారు. మరోసారి ఇంతవరకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవటంతో పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండు దశాబ్దాల తరువాత మంత్రి రవికుమార్ రెండు రోడ్ల పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆయా గ్రామాలకు రవాణా వసతి మెరుగుపడనుంది.



ఉప్పలపాడు-మైలవరం మధ్య చిల్లచెట్లతో మూసుకు పోయిన రహదారి




వేణుగోపాలస్వామి దేవాలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు, హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

## వేణుగోపాల స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

బల్లికురవ. ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో జీర్ణావస్థలో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమిపూజ వైభవంగా నిర్వహించారు. గ్రామస్థుల సమష్టి కృషితో దేవాలయ నిర్మాణానికి ముందుకు వచ్చారు. భూమిపూజ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలలో పాల్గొని హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి పునర్నిర్మాణంలో భాగస్వాములవుదాం

**రాష్ట్ర వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీ.ఆర్.రాజన్**

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, పర్చూరు నియోజకవర్గ పరిశీలకులు సీ.ఆర్.రాజన్ పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన విజయవంతం చేసేందుకు బుధవారం మండల పరిధిలోని టీడీపీ నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడు రాజధానుల ముసుగులో ఆంధ్రుల రాజధాని అమరావతిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రతి ఇంటి నుండి ప్రధాని సభకు తరలి రావాలని అన్నారు. చినగంజాం మండలం నుండి 13 బస్సులు, కార్లను సభకు వినియోగిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు పొద వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఏపీఎం జి.పెదసుబ్బారావు, మండల పరిధిలోని టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

యద్దనపూడి,(మార్టూరు): రాష్ట్రానికి శుక్రవారం విచ్చేయుచున్న ప్రధాన మంత్రి మోదీ సభకు భారీగా ప్రజానీకం తరలిరావాలంటూ బుధవారం యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్యచౌదరి,గుదే తారకరామారావు, సాదినేని సుధీర్,కొరటాల వంశీ కృష్ణ,కనపర్తి నాగేశ్వరరావు,కోయ సతీష్,రావిపాటి సీతయ్య గొట్టిపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: రాష్ట్ర రాజధాని అమరావతిలో రేపు ప్రధాని పర్యటనకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు హాజరై విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి దేవదత్తు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్లికురవ మండలంలో 13 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఉదయం 8 గంటలకు బయలుదేరాలన్నారు. అన్ని గ్రామాలలో అధికారులు ప్రజలకు తెలియజేయాలని పెద్దఎత్తున ప్రజలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమకుమారి, ఈవోపీఆర్‌డీ సుమతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజన్

## మేడేను అంబేడ్కర్ మేడేగా నిర్వహించాలి

చినగంజాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మేడేను కార్మికులు అంబేడ్కర్ మేడేగా నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మేడికొండ సునీల్ బుధవారం ఒక ప్రకటనలో కార్మికులను కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బ్రిటీష్ ప్రభుత్వంలో 1942-46 మధ్య లేబర్ కమిషనర్‌గా పనిచేసి, కార్మికుల కోసం ఆయన అనేక చట్టాలు పోరాడి సాధించారన్నారు. సోషలిజం అని కలలుగనే కమ్యూనిస్టులు మార్క్స్, మావో లెనిన్ గురించి మాట్లాడతారానీ, కార్మికుల కోసం అంబేడ్కర్ చేసిన చట్టాల గురించి ఎక్కడా మాట్లాడరని అన్నారు. సమ్మె కార్మికుల ప్రాథమిక హక్కు అని 1937లో పోరాడిన అంబేడ్కర్‌ని విప్లవ కమ్యూనిస్ట్ పార్టీలు కూడా విస్మరించడం చారిత్రాత్మక ద్రోహం అని అన్నారు. 1942వ సంవత్సరం వరకు ఉన్న 14 గంటల పనిదినాన్ని 8గంటలకు తగ్గించిన ఘనత అంబేడ్కర్‌దేనని అన్నారు. 1923వ సంవత్సరంలో వర్క్‌మెన్ కాంపెన్సేషన్ చట్టం, 1936లో పేమెంట్ ఆఫ్ వేజెస్ చట్టం, 1943లో ఆరోగ్య బీమాచట్టం, 1944లో సెలవులలోను జీతం చెల్లించే చట్టం, 1948లో కనీస వేతన చట్టాలను అంబేడ్కర్ ఆనాటి బ్రిటిష్ పాలకులతో పోరాడి సాధించారన్నారు. ఎక్కడో అమెరికాలో జరిగిన కార్మిక పోరాట నేపథ్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం జరిపే కమ్యూనిస్టులు, ట్రేడ్ యూనియన్లు చైనా, రష్యా దేశాల విప్లవాల గురించి చెబుతారన్నారు. అయితే అంబేడ్కర్ కార్మికుల కోసం పోరాడి తెచ్చిన చట్టాల గురించి చెప్పరన్నారు. ఆనాడు అంబేడ్కర్ పోరాడి సాధించిన చట్టాలే ఈనాడు భారతీయ కార్మికవర్గ సమాజానికి పునాదిరాళ్లుగా నిలిచాయన్నారు. అంబేడ్కర్ కార్మిక, కర్షక, దళిత, గిరిజన, బహుజన, మైనార్టీలకు భారత రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించి వారికి రక్షణ కల్పించిన గొప్ప దార్శనీకుడని కొనియాడారు. కార్మికుల కోసం అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అందించిన చట్టాలను అనుభవిస్తున్న కార్మిక సమాజం మేడేని అంబేడ్కర్ మేడేగా జరుపుకోవాలని సునీల్ డిమాండ్ చేశారు.

## ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

- లారీ ఢీకొని పక్కకు ఒరగడంతో బెంబేలెత్తిన ప్రజలు



లారీ ఢీకొట్టడంతో ఒరిగిన విద్యుత్‌స్తంభం

బల్లికురవ. ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో మలుపుల వద్ద రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. బుధవారం మార్టూరు వైపు నుంచి అద్దంకి వైపు వచ్చే సిమెంట్ లోడ్ లారీ మలుపులో విద్యుత్ స్తంభాన్ని డీకొట్టింది. దీంతో విద్యుత్‌స్తంభం కొంత మేర నేలవాలింది. దీంతో ప్రక్కనే ఉన్న ప్రజలు భయాందోళనతో పరుగులు పెట్టారు. స్తంభం పూర్తిగా పడిపోయి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చటం లేదని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలీలో రోడ్డు మలుపులలో ఉన్న స్తంభాలను తొలగించాలని ఎన్నిమార్లు అధికార్లకు తెలిపిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరగక ముందే అధికారులు స్తంభాలను తొలగించే పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## మావోయిస్టులతో శాంతిచర్చలు నిర్వహించాలి

- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు

చీరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం - మావోయిస్టుపార్టీ కాల్పులు విరమించి శాంతి చర్చలు నిర్వహించాలని పలువురు ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీలపై దారుణకాండను కొనసాగించడం అన్యాయమన్నారు. దేశపౌరులు ఉన్నత పదువులతో కూడిన బాధ్యతలు కల్పిస్తే ప్రకృతి వనరులు రక్షించకుండా, విదేశీ బహుళ జాతి సంస్థలకు దోచి పెడుతున్నట్లు ఆరోపించారు. వెంటనే శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జనసమాఖ్య వ్యవస్థాపకులు మాచర్ల మోహనరావు, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు మోహన్‌కుమార్‌ధర్మ, శీలం రవి, గోసాల అశోక్, తదితర ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

## పన్ను వసూలులలో అద్దంకి తొలిస్థానం

- 5 శాతం రాయితీని అందిపుచ్చుకుంటున్న పట్టణ ప్రజలు



పన్ను చెల్లించేందుకు క్యూలో ఉన్న ప్రజలు

అద్దంకి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అడ్వాన్స్ ఇంటి పన్ను వసూలులో అద్దంకి మున్సిపాలిటీ రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5 శాతం రాయితీతో చెల్లింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో రూ.5.27 కోట్లు పన్ను వసూలు లక్ష్యం కాగా బుధవారం రాత్రి కి సుమారు రూ.2.27 కోట్లు వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. బుధవారం ఒక్కరోజే రూ.20.91 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. 43 మున్సిపాలిటీల పరిధిలో అద్దంకి మున్సిపాలిటీ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ముందస్తుగా ఇంటి పన్నులు చెల్లించిన యజమానులకు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర కృతజ్ఞతలు తెలిపారు. పన్ను వసూలుకు కృషిచేసిన సిబ్బందిని అభినందించారు.